## నీలగిరి నిత్యపద్యం

**ఆటవెలది**

స్వార్థ చింతనంబు వ్యర్థమే బ్రతుకున
పరులమేలుజేయు,మరచిబోకు
జేసినట్టి మేలు జెడుజేయదెప్పుడూ
కష్టకాలమందు కలిసివచ్చు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

RNI - TELTEL/2023/87644

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 207 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 8-11-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




## హైదరాబాద్ అభివృద్ధికి

# ఆ ఇద్దరే అడ్డంకి

**బ్యాడ్ బ్రదర్స్ ఇద్దరు అభివృద్ధికి మోకాలడ్డు**





### ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ హయాంలోనే నగరాభివృద్ధి


- హైదరాబాద్‌ను డ్రగ్స్‌కు అడ్డాగా చేసిన కేటీఆర్
- మూసీ పునరుద్ధరణ, మెట్రో పొగింపులకు కిషన్ రెడ్డి అడ్డు
- నగరంలో 44 చెరువులను కబ్జా చేసిన బీఆర్ఎస్ నేతలు
- జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ కూడా రాదు
- ఎన్నిక ఏదైనా తానే రంగంలో ఉన్నట్లుగా భావిస్తా
- ఓట్లు వేసి గెలిపిస్తే నగరాభివృద్ధికి పెద్దపీట
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,-నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే హైదరాబాద్ ఎక్కువగా అభివృద్ధి చెందిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి ఎపిలో 2004-2014 మధ్య కాలంలోనే రాష్ట్రంలో అభివృద్ధి అన్నది కనిపించిందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయం, మెట్రో రైలు.. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిందన్నారు. 2014 నుంచి కేంద్రంలోని భాజపా, రాష్ట్రంలోని భారత రాష్ట్ర సమితి.. రాష్ట్రానికి చేసింది శూన్యం. హైదరాబాద్‌లో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. 2014లో రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ

-మిగతా 2 లో

## సీఎం రేవంత్‌వి బ్లాక్ మెయిల్ రాజకీయాలు

- ఓటర్లను బెదిరించే ధోరణిలో ప్రసంగాలు
- ఓట్లు వేయకుంటే రేషన్ కార్డులు ఇవ్వమనడం దారుణం
- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు



**హైదరాబాద్,**

బ్లాక్ మెయిల్ చేసి జూబ్లీహిల్స్‌లో ఓట్లు వేయించుకోవాలని సిఎం రేవంత్ చూస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకుంటే.. రేషన్ కార్డులు ఆగిపోతాయంటున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అయ్య జాగీరా? రేవంత్ ఇంట్లో నుంచి ఇస్తున్నారా అంటూ ఫైర్ అయ్యారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిలర్ అంటూ కామెంట్స్ చేశారు.

-మిగతా 2 లో




## సంకల్పబలం...
# వందేమాతరం

- వందేమాతరం గీతం కొత్త స్ఫూర్తిని ఇస్తుంది
- వందేమాతరం అంటే ఓ పదం, ఓ మంత్రం, ఓ శక్తి, ఓ కళ, ఓ పట్టుదల
- 1937లో వందేమాతరం గేయంలో కొన్ని చరణాలను తొలగించారు
- వందేమాతరం సంస్మరణ ఉత్సవంలో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:**

వందేమాతం జాతీయ గీతానికి 150 ఏళ్లు నిండాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ ఉత్సవంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. వందే మాతరం గీతంలోని కొన్ని ముఖ్యమైన చరణాలను 1937లో తొలగించినట్లు ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేస్తూ మోదీ ఆ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. విభజనకు చెందిన కొన్ని చరణాలను ఆ గేయం నుంచి తొలగించారని, ఇప్పటికీ లాంటి విభజన మైండ్‌సెట్ దేశానికి సవాల్‌గా మారిందని ప్రధాని మోదీ అన్నారు. ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో వందేమాతరం 150 ఏళ్లకు చెందిన సంస్మరణ స్టాంపు, నాణాన్ని ప్రధాని రిలీజ్ చేశారు.భారత స్వాతంత్ర్య ఉద్యమంలో

-మిగతా 2 లో

### జూబ్లీ గెలుపుపై
## ఎవరి ధీమా వారిదే

- సర్వేలపైనా పలు పార్టీల నజర్



2 లో

## ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ జీతం ట్రిలియన్ డాలర్లు ..

- ఆమోదం తెలిపిన టెస్లా కంపెనీ షేర్‌హోల్డర్లు

**లాస్ ఏంజిల్స్**



కార్పొరేట్ చరిత్రలోనే ఎలన్ మస్క్ సంచలనం సృష్టించారు. అత్యధిక జీతం అందుకుంటున్న సీఈవోగా ఆయన రికార్డు క్రియేట్ చేశారు. జీతం కింద మస్క్‌కు ట్రిలియన్ డాలర్లు ఇచ్చేందుకు టెస్లా కంపెనీ షేర్‌హోల్డర్లు ఆమోదించారు. దీంతో పే ప్యాకేజీలో కొత్త రికార్డు క్రియేట్ అయ్యింది. కంపెనీకి చెందిన షేర్‌హోల్డర్లలో 75 శాతం ఓట్లు ఆయనకు అనుకూలంగా వచ్చాయి. వార్షిక కంపెనీ మీటింగ్‌లో మస్క్ జీతంపై నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ప్రపంచ కుబేరుడైన మస్క్.. ఇప్పుడు తన సంపదను మరింత పెంచుకోనున్నారు. అయితే రాబోయే పదేళ్లలో ఎలక్ట్రిక్ కార్ల

-మిగతా 2 లో

## ప్రైవేట్ విద్యాసంస్థల
# తాట తీస్తా

### విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటారా


- బంద్ పెట్టి బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తానంటే ఎలా
- విద్యార్థుల అకడమిక్ ఇయర్ లాస్‌కు ఎవరు బాధ్యులు
- ఫీజులు ఇష్టానుసారం పెంచి రియంబర్స్‌మెంట్‌పై ఒత్తిడి
- రాజకీయ పార్టీల ఉచ్చులో పడి బెదిరిస్తే ఊరుకునేది లేదు
- ప్రైవేట్ విద్యాసంస్థల తీరుపై సీఎం రేవంత్ ఘాటు హెచ్చరికలు



**హైదరాబాద్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు తమాషా చేస్తే తాటతీస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. విద్య అనేది సేవ.. వ్యాపారం కాదని స్పష్టం చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు సేవ చేయడం లేదు.. వ్యాపారం చేస్తున్నాయని సీరియస్ అయ్యారు. శుక్రవారం గాంధీభవన్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు నష్టం కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఫీజు రీయంబర్స్ మెంట్‌పై ప్రైవేటు విద్యాసంస్థలు బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కాలేజీలను బంద్ చేయించిన

-మిగతా 2 లో

## 2026లో భారత్ లో పర్యటిస్తా



- ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, నా మిత్రుడు
- వాణిజ్య సంబంధాలను పటిష్టం చేస్తా
- డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,**

అమెరికా- భారత్ మధ్య టారిఫ్ ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, తన మిత్రుడు అంటూ కొనియాడారు. అలాగే, ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను పటిష్టం చేసే ప్రయత్నాల్లో భాగంగా, వచ్చే ఏడాది తాను భారత్‌ను సందర్శించే అవకాశం ఉందని ట్రంప్ ప్రకటించారు. వైట్‌హౌస్‌లో ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్‌తో వాణిజ్య చర్చలపై విలేకరులు ప్రశ్నలు అడిగారు. ఈ క్రమంలో మోదీతో తన చర్చలు అద్భుతంగా సాగుతున్నాయని ట్రంప్ సమాధానం చెప్పారు. ప్రధాని మోదీ రష్యా నుంచి ఇంధన కొనుగోలును చాలా వరకు ఆపేశారు. ఆయన నాకు మిత్రుడు, మేము మాట్లాడుతుంటాం. మోదీ గొప్ప వ్యక్తి. ఆయన నాకు మిత్రుడు, ఆయన నన్ను అక్కడికి రావాలని ఆహ్వానించారు. నేను తప్పకుండా వెళతాను. పర్యటనను ఖరారు చేస్తామని అన్నారు. తాను భారత్‌కు వెళతానని ట్రంప్ చెప్పిన నేపథ్యంలో వచ్చే ఏడాది వెళ్లే అవకాశం ఉందా?

-మిగతా 2 లో

## రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

- పంట నష్టపోయిన కౌలు రైతులకు పెట్టుబడి సాయం
- సకాంలో బీమా ప్రీమియం చెల్లించి రైతులను ఆదుకున్నాం
- పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేలా ప్రత్యేక చర్యలు
- పంటలకు ఇబ్బంది లేకుండా సాగునీటి సరఫరా
- రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు
- కరువును శాశ్వతంగా తరిమేలా ప్రణాళికలు
- ఆచార్య ఎన్‌జి రంగా జయంతి వేడుకల్లో సీఎం చంద్రబాబు



**గుంటూరు, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో ఏ ఒక్క రైతూ అధైర్యపడొద్దు.. ఆత్మహత్యలు చేసుకోవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. తుఫాను ప్రభావంతో పంటలు నష్టపోయిన కౌలు రైతులకు పెట్టుబడి రాయితీ ఇస్తున్నామని తెలిపారు. పంటల బీమా ప్రీమియం కూడా జగన్ ప్రభుత్వం చెల్లించలేదని ధ్వజమెత్తారు. దీంతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలో ప్రీమియం సకాలంలో చెల్లించామని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు. ఆచార్య ఎన్జీరంగా 125వ జయంతి ఉత్సవాల్లో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రైతును ఆదుకునేందుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. మొన్నటి తుపానులో

-మిగతా 2 లో

## ఆఫ్ఘన్-పాక్ సరిహద్దులో కాల్పుల మోత..

- ఆఫ్ఘనిస్థాన్ వైపు నుంచే కాల్పులు ప్రారంభమయ్యాయి.
- ఐదుగురు ఆఫ్ఘన్ పౌరుల మృతి
- పాకిస్థాన్ సమాచార మంత్రిత్వ శాఖ స్పష్టం

**కాందహార్ ప్రావిన్స్,**




ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు జరుగుతున్న తరుణంలోనే గురువారం సరిహద్దుల్లో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఐదుగురు ఆఫ్ఘన్ పౌరులు మరణించగా, మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ కాల్పులకు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ ఇరు దేశాలు ప్రకటనలు విడుదల చేశాయి. ఆఫ్ఘనిస్థాన్‌లోని కాందహార్ ప్రావిన్స్‌కు చెందిన స్పిన్ బోల్డాక్ జిల్లా ఆసుపత్రి అధికారి ఈ వివరాలను వెల్లడించారు. మృతుల్లో నలుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నట్లు ఆయన తెలిపారు. పాకిస్థాన్ వైపు ప్రాణనష్టంపై తక్షణ సమాచారం అందుబాటులో లేదు. టర్కీలోని ఇస్తాంబుల్‌లో పాకిస్థాన్‌తో మూడో విడత చర్చలు ప్రారంభమైన సమయంలోనే పాక్ దళాలు తమపై కాల్పులు జరిపాయని తాలిబన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ ఆరోపించారు. "చర్చల బృందానికి గౌరవం ఇచ్చి, పౌర నష్టాన్ని నివారించేందుకు మా దళాలు సంయమనం

-మిగతా 2 లో

## ఫీజు రియంబర్స్‌మెంట్ ఎత్తేసే కుట్ర

- రేవంత్ వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం
- బకాయిలు చెల్లించకుంటే చదువెలా సాగిస్తారు
- ప్రైవేట్ కాలేజీలకు మా మద్దతు కొనసాగిస్తాం
- కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడి



**హైదరాబాద్, -నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తేసే కుట్రలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని, కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే.. ప్రైవేట్ కాలేజీ యజమాన్యాలని సీఎం రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ చేస్తారా..? అని ఫైర్ అయ్యారంటే అరథం చేసుకోవచ్చన్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రతినెలా బకాయిలు చెల్లిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చింది నిజం కాదా..? అని ప్రశ్నించారు.

-మిగతా 2 లో

## ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ జీతం ట్రిలియన్ డాలర్లు

(మొదటి తరువాయి)

కంపెనీ టెస్లా మార్కెట్ వాల్యూ ఆయన మరింత పెంచాల్సి ఉంటుంది. ఒకవేళ షేర్‌హోల్డర్లు అనుకున్నట్లు మస్క్ తన లక్ష్యాలను సాధిస్తే, అప్పుడు ఆయనకు లక్షల సంఖ్యలో షేర్లు కలిసిరానున్నాయి.మరీ భారీగా జీతాన్ని ఇవ్వడం పట్ల విమర్శలు వచ్చాయి. కానీ టెస్లా బోర్డు మాత్రం సీఈవో మస్క్‌కు అండగా నిలిచింది. ఒకవేళ ఆయన జీతాన్ని ఆమోదించకుంటే, అప్పుడు ఆయన ఈ కంపెనీ వదిలి వెళ్లే అవకాశాలు ఉన్నట్లు బోర్డు భయాందోళనకు గురైంది. ప్రస్తుతం ఉన్న దశలో మస్క్‌ను వదులుకోలేమని టెస్లా బోర్డు చెప్పింది. టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో ఉన్న మస్క్ తన జీతం విషయం తెలియగానే ఆయన సంతోషాన్ని ఆపుకోలేకపోయారు. టెస్లాలో ఇది కొత్త అధ్యాయం మాత్రమే కాదు, ఇదో కొత్త చరిత్ర అవుతుందన్నారు.మస్క్‌కు ట్రిలియన్ డాలర్ల పే ప్యాకేజీ అందాలంటే ఆయన ముందు కొన్ని టార్గెట్లను పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం టెస్లా మార్కెట్ విలువ 1.4 ట్రిలియన్ల డాలర్లుగా ఉన్నది. అయితే ఆ మార్కెట్ విలువను ఆయన 8.5 ట్రిలియన్ డాలర్లకు చేర్చాల్సి ఉంటుంది. స్వీయ డ్రైవింగ్ చేస్తున్న లక్షల సంఖ్యలో రోబోట్యాక్సీ వాహనాలను ఆయన కమర్షియల్ ఆపరేషన్‌లోకి తీసుకురావాల్సి ఉంటుంది. ఒకవేళ అన్నీ అనుకుట్లే సాగితే, ప్రపంచ కుబేరుడు మస్క్ ప్రపంచంలోనే తొట్టతొలి ట్రిలియనీర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## జుబ్లీ గెలుపుపై ఎవరి ధీమా వారిదే

### సర్వేలపైనా పలు పార్టీల నజర్




హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాదులోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి మరో వారం రోజుల్లో ఉప ఎన్నిక జరుగుతోంది. ప్రస్తుతం బరిలో ఉన్న అన్ని ప్రధాన పార్టీల్లోనూ గెలుపుపై తీవ్రమైన సస్పెన్స్ కొనసాగుతోంది.
ఎవరికి వారు గెలుపు గుర్రంపై ధీమా వ్యక్తం చేస్తున్నా అంతర్గత చర్చల్లో మాత్రం ప్రత్యర్థుల ఎత్తులపై చర్చలు వేస్తున్నారు. వారి కంటే మనం బాగా ప్రచారం చేస్తున్నామా ఎక్కడెక్కడ ? ముందు ఉన్నాం ఏ ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నాం అనేదానిపై రకరకాల సర్వేలు చేస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన ప్రచారాన్ని భేరీజు వేసుకుంటున్నారు. ఈ క్రమంలోని బిఆర్ఎస్ – కాంగ్రెస్ వర్గాలు సర్వేలను ఆధారం చేసుకుని గెలుపు తమది అంటూ ప్రచారం చేసుకోవడం ఒక అంశం అయితే .. ఈ ఉప ఎన్నికల్లో గెలుపు ఆధారంగా ఆయా పార్టీలు తమ నాయకులకు పదవులు ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తూ ఉండటం విశేషం. కాంగ్రెస్ పార్టీ నుంచి మంత్రి పదవులు ఆశించిన వారు .. నామినేటెడ్ పదవులు ఆశించిన వారు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో ఆ పార్టీని గెలిపించేందుకు గట్టిగా కష్టపడుతున్నారు. ఇక బిఆర్ఎస్ లోను ఇదే తరహా ప్రచారం జరుగుతోంది. పార్టీ పదవుల కోసం ఆశలు పెట్టుకున్న వారు ... వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఆశిస్తున్న వారు కేసీఆర్ దగ్గర మంచి మార్కుల కోసం .. కేటీఆర్ దగ్గర మంచి మార్కుల కోసం గట్టిగా కష్టపడుతున్నారు. ఉప ఎన్నికల్లో తమ సత్తా చాటాలని ప్రయత్నాలు చేస్తున్నారు. మరి వీరిలో ఎవరి ఆశలు నెరవేరుతాయో చూడాలి.

## సంకల్పబలం... వందేమాతరం

(మొదటి తరువాయి)

వందేమాతరం ఈ దేశ స్వరంగా మారిందన్నారు. ప్రతి భారతీయుడి తమ మనోభావాలను ఆ గేయం ద్వార వ్యక్తపరిచారన్నారు. కానీ 1937లో దురదృష్టవశాత్తు, వందేమాతరం గేయంలోని కొన్ని చరణాలను తొలగించారని, వందేమాతర గీత విభజన దేశ విభజనకు బీజం వేసిందన్నారు. జాతి నిర్మాణం కోసం రూపొందించిన ఈ మహామంత్రం పట్ల ఎందుకు అన్యాయం జరిగిందో ఈ తరం యువత తెలుసుకోవాలన్నారు. ఇలాంటి విచ్ఛిన్నకర మైండ్‌సెట్ దేశానికి ఇప్పటికీ సవాలే అన్నారు. ఉగ్రవాదం పేరుతో శత్రువులు మన భద్రత, గౌరవంపై దాడి చేస్తే, అప్పుడు భారత్ ఎలా దుర్గ అవతారాన్ని ఎత్తిందో ప్రపంచ వీక్షించినట్లు పేర్కొన్నారు. వందేమాతర గీతం కొత్త స్ఫూర్తిని ఇస్తుందని, ఈ దేశాన్ని కొత్త శక్తితో నింపుతోందన్నారు. వందేమాతరం అంటే ఓ పదం, ఓ మంత్రం, ఓ శక్తి, ఓ కళ, ఓ పట్టుదల అని ఆయన అన్నారు. భారతమాత పట్ల ఇది భక్తికి నిదర్శనమన్నారు. మన చరిత్రను చాటుతూ.. మనకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. అనుకున్నది సాధించలేనిది ఏమీ లేదని, భారతీయులు దేన్నైనా సాధించగలరని, జ్ఞానం..విజ్ఞానం.. సాంకేతిక నిండిన దేశాన్నినిర్మించాలన్నారు.

## 2026లో భారత్ లో పర్యటిస్తా

(మొదటి తరువాయి)

అని విలేకరులు అడిగారు. దీనికి ట్రంప్ బదిలిస్తూ ' అవును, వచ్చే ఏడాది ఉండొచ్చు' అని సమాధానం చెప్పారు. వాస్తవానికి భారత్?లో జరగాల్సిన క్వాడ్ మీటింగ్‌కు ట్రంప్ రావాల్సి ఉంది. అయితే ట్రంప్ ఇకపై క్వాడ్ సమ్మిట్ కోసం భారత్‌కి రాకపోవచ్చని అన్నారు. ఈ ఏడాది ఆగస్టులో ఒక వ్యాసంలో పేర్కొంది. భారత్‌తో వాణిజ్య సుంకాల (టారిఫ్) వివాదాల నేపథ్యంలో ఆ ప్రయాణాన్ని వాయిదా వేసినట్లు ఆ రిపోర్ట్ తెలియజేసింది. అయితే ట్రంప్ తాజాగా చేసిన వ్యాఖ్యలు రెండు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ సానుకూల దిశలో సాగుతున్నాయనే సంకేతంగా భావించవచ్చు. ప్రస్తుతం భారత్ – అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కీలక దశలో ఉన్నాయి. ఈ క్రమంలో ట్రంప్ నుంచి ఇలాంటి కామెంట్స్ రావడం ప్రాధాన్యత సంతరించుకొన్నది. రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో అమెరికా అదనంగా 25 శాతం సుంకాలని విధించిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాను ఆర్థికంగా ఒంటరి చేయాలని భారత్‌పై ట్రంప్ అదనపు సుంకాలను విధించారు. అయితే, తాజాగా భారత్ రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లను తగ్గించుకోవాలని నిర్ణయించినట్లు ఇటీవల ట్రంప్ స్వయంగా ప్రకటించారు. అంతేకాకుండా, ఆగిపోయిన వాణిజ్య చర్చలు కూడా ఫలప్రదంగా సాగుతున్నట్లు వెల్లడించారు. దీపావళి రోజు కూడా మోదీకి కాల్ చేసి ట్రంప్ శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు రష్యా చమురు కొనుగోలు, వాణిజ్యంపై చర్చించినట్లు ట్రంప్ మరోసారి పునరుద్ఘాటించారు. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కూడా దీనిపై క్లారిటీ ఇచ్చారు. అధ్యక్షుడు ట్రంప్ భారత్–అమెరికా సంబంధాలపై సానుకూలంగా ఉన్నారని, వైట్‌హౌస్‌లో జరిగిన దీపావళి వేడుకల సందర్భంగా ప్రధాని మోదీతో నేరుగా మాట్లాడారని ధృవీకరించారు.

## ఆఫ్ఘన్-పాక్ సరిహద్దులో కాల్పుల మోత..

(మొదటి తరువాయి)

పాటిస్తున్నాయి" అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. "ఆఫ్ఘన్ వైపు నుంచి వచ్చిన ఆరోపణలను మేము తోసిపుచ్చుతున్నాం. ఆఫ్ఘనిస్థాన్ వైపు నుంచే కాల్పులు ప్రారంభమయ్యాయి. మా భద్రతా దళాలు బాధ్యతాయుతంగా, పరిమితంగా స్పందించాయి" అని పాకిస్థాన్ సమాచార మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. కాల్పులు సుమారు 10 నుంచి 15 నిమిషాల పాటు జరిగినట్లు స్థానిక అధికారులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చిందని, కాల్పుల విరమణ అమలులో ఉందని పాకిస్థాన్ ధ్రువీకరించింది. ఇరు దేశాల మధ్య ఘర్షణలను నివారించేందుకు టర్కీ వేదికగా శాంతి చర్చలు జరుగుతున్నాయి. అయితే కాల్పుల విరమణ ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకోవడంలో గత వారం చర్చలు ప్రతిష్ఠంభనలో పడ్డాయి.

# హైదరాబాద్ అభివృద్ధికి ఆ ఇద్దరే అడ్డంకి

(మొదటి తరువాయి)




రాష్ట్రం ఏర్పడింది. 2023లో కేసీఆర్ తెలంగాణను రూ.8లక్షల కోట్ల అప్పుల్లో పెట్టి మళ్లీ కాంగ్రెస్‌కు అప్పగించారు. హైదరాబాద్‌కు యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన ఐటీఐఆర్‌ను రద్దు చేసింది ఎవరని అన్నారు. ఐటీఐఆర్ కూడా మంజూరు చేసి ఉంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెంది ఉండేదని అన్నారు. వరదలు వచ్చి హైదరాబాద్ మునిగిపోతే కేంద్రం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి వరద సాయంగా రూపాయి కూడా తేలేదని అన్నారు. హైదరాబాద్‌లో 44 చెరువులను భారత రాష్ట్ర సమితి నేతలు కబ్జా చేశారు. అంబర్‌పేటలో బతుకమ్మకుంటను ఆ పార్టీ అంబర్‌పేట ఇన్‌ఛార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆక్రమించారు. చెరువుల్లోని కబ్జాలను తొలగించి పునరుద్ధరిస్తే.. దానిపై రాజకీయం చేస్తున్నారు. అహ్మదాబాద్‌లో సబర్మతి ప్రక్షాళన చేసుకున్నారు.. యూపీలో నది ప్రక్షాళన చేశారు. అహ్మదాబాద్‌లో కొత్త నగరం కట్టుకున్నారు.. తెలంగాణలో అడ్డుకుంటున్నారు. గతంలో కాంగ్రెస్ వల్లే నగరం అభివృద్ధి చెందింది. ఇప్పుడూ కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి పనులు జరుగుతాయి. అభివృద్ధి పనుల వల్ల పేదలకు నష్టం జరిగితే ఆదుకుంటాం. ఇళ్లు కోల్పోయిన పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తాం. ప్రజలను ఓటు అడుగుతున్నా.. మీ ఓటు ద్వారా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందాం అని సీఎం విజ్ఞప్తి చేశారు. భారత రాష్ట్ర సమితి హయాంలో కాళేశ్వరం, కమాండ్ కంట్రోల్ సెంటర్, సచివాలయం, ప్రగతి భవన్ నిర్మించారు. కుమారుడిని ముఖ్యమంత్రిని చేయాలని, వాస్తు సరిగా లేదని బాగున్న సచివాలయాన్ని కూలగొట్టి.. కొత్తది నిర్మించారు. పేద ప్రజలకు ఆ సచివాలయం వల్ల ఏమైనా ఉపయోగం ఉందా? కొత్త ఉద్యోగాలు ఏమైనా వచ్చాయా? అంటూ ప్రశ్నించారు. ప్రతిపక్షాలు, మీడియా ప్రతినిధులపై నిఘా పెట్టేందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఎవరికీ అనుమతి లేని విలాసవంతమైన భవనాలు మాత్రమే నిర్మించారు. రైతు కోసమని కట్టిన కాళేశ్వరం మాత్రం మూడేళ్లకే కూలింది. పదేళ్లలో మెట్రో రైలును కొత్తగా కిలోమీటరు కూడా పొడిగించలేదు. మంజూరైన పాతబస్తీ మెట్రోను కూడా పక్కకు పెట్టారు. మెట్రో నిర్మించిన ఎల్ అండ్‌టీ నష్టాలకు కూడా భారత రాష్ట్ర సమితే కారణం అని సిఎం అన్నారు. 2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు కావస్తోంది. భవిష్యత్ ప్రణాళికలు ఎలా ఉండాలో విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నాం. మెట్రో విస్తరణకు రూ.43వేల కోట్లతో ప్రణాళికలు కేంద్రానికి ఇచ్చాం. ఆనాడు హైదరాబాద్ అభివృద్ధి కోసం కొట్లాడిన శశిధర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డిని హైదరాబాద్ బ్రదర్స్ అనే వాళ్లు. నేడు హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి, కేటీఆర్‌ను బ్యాడ్ బ్రదర్స్ అంటున్నారు. వీరిద్దరూ కలిసి మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు, ఫ్యూచర్‌సిటీని అడ్డుకుంటున్నారు. గోదావరి జలాలు 20 టీఎంసీలు హైదరాబాద్ నగరానికి తేవాలని ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారు. హైదరాబాద్‌లో నిర్మించాలనుకున్న ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. 30 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కంటోన్మెంట్ నుంచి శామీర్‌పేట, మేడ్చల్‌కు ఎలివేటెడ్ కారిడార్లకు అప్రూవల్ తెచ్చి రూ.5వేల కోట్లతో పనులు ప్రారంభించాం. ఉత్తర తెలంగాణ మొత్తం ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్లపైనే ఆధారపడి ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి.. వాటి అనుమతులకు ప్రయత్నం చేయలేదని అన్నారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చాం. అదనంగా కొత్తగూడెం, రామగుండం ఎయిర్‌పోర్టులకు ప్రయత్నాలు చేస్తున్నాం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి 6 నెలలు పార్లమెంట్ ఎన్నికలతో గడిచిపోయాయి. ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో పనిచేసింది ఏడాదిన్నర మాత్రమే. ఏడాదిన్నరలోనే రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చాం. రూ.లక్ష కోట్ల ఆదాయం వచ్చే ఓఆర్ఆర్‌ను కేవలం రూ.7వేల కోట్లకు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అమ్ముకుంది. దీపావళి రోజు కూడా ఇళ్లలో డ్రగ్స్‌తో పట్టుబడిన వారిని ఏమనాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీకి డిపాజిట్ రాదని...రాసిపెట్టుకోవాలని సీఎం రేవంత్ అన్నారు. బీజేపీ ఓడితే..హిందువులంతా బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నారని ఒప్పుకుంటారా.. బండి సంజయ్ దీనిని రెఫరెండంగా భావిస్తారా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ లో బీజేపీ గెలవాలని కిషన్ రెడ్డికే లేదన్నారు. బీఆర్ఎస్ ను ఓడించండి..బీజేపీ డిపాజిట్ గల్లంతు చేయాలని పిలుపునిచ్చారు రేవంత్. ఏ ఎన్నికనైనా తాను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటానన్నారు రేవంత్.. పార్టీ అభ్యర్థి ఉన్న చోట తాను పోటీలో ఉన్నట్లే ఫీలవుతా... కేసీఆర్ లా ఫామ్ హౌస్ లో పడుకోవాలా? అని ప్రశ్నించారు. ప్రతీ ఎన్నిక తమ ప్రభుత్వ పనితీరుకు పరీక్షేనన్నారు. అండగా ఉంటే పదేళ్లలో అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానన్నారు. సర్వేల గురించి తాను మాట్లాడనన్నారు రేవంత్..డబ్బులిచ్చి సర్వేలు చేయించుకుంటున్నారని ఆరోపించారు. కిషన్ రెడ్డి..కేసీఆర్,కేటీఆర్ లకు లొంగిపోయారని విమర్శించారు.

# సీఎం రేవంత్‌వి బ్లాక్ మెయిల్ రాజకీయాలు

(మొదటి తరువాయి)

చెప్పుకోవడానికి ఏమీ లేకనే.. జూబ్లీహిల్స్‌లో రేవంత్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని అన్నారు. ఓటమి భయంతో రేవంత్ రెడ్డి వ్యక్తిగత కామెంట్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్లాక్ మెయిలర్‌కు జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు.కంటోన్మెంట్‌లో ఆరు వేల డబుల్ బెడ్రూం ఇళ్ళు ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రజలను మభ్యపెట్టి కంటోన్మెంట్‌లో గెలిచారన్నారు. రెండేళ్ళుగా అజహారుద్దీన్‌కు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. బీఆర్ఎస్ ఒత్తిడితోనే ముస్లింలకు మంత్రి పదవి.. ఎన్టీఆర్, పీజేఆర్ విగ్రహాల హామీలు అంటూ వ్యాఖ్యలు చేశారు. సీనీ యాక్టర్స్‌ను జైల్లో పెట్టిన రేవంత్.. సినీ కార్మికులకు ఒంగి ఒంగి దండాలు పెడుతున్నారంటూ ఎద్దేవా చేశారు. 2023లో పీజేఆర్ కొడుకుకు ఎందుకు టికెట్ ఇవ్వలేదని అడిగారు. కాంగ్రెస్ అరాచకం, మంత్రి పదవి ఇవ్వకపోవటంతోనే పీజేఆర్ చనిపోయారంటూ సంచలన కామెంట్స్ చేశారు. జూబ్లీహిల్స్ ప్రజల తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు దశ దిశ ఏర్పడుతుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గం కూడా సంతృప్తిగా లేదని అన్నారు. నాలుగు కోట్ల ప్రజలు కాదు.. నలుగురు బ్రదర్స్ మాత్రమే హ్యాపీగా ఉన్నారంటూ కామెంట్స్ చేశారు. గ్యారంటీలు ఎగ్గొట్టిన అరాచక ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంటూ విరుచుకుపడ్డారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిస్తే.. మూడేళ్ళ పాటు నరకయాతన అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. వికాసానికి.. విధ్వంసానికి మధ్య జరుగుతున్న ఎన్నికల్లో ఏది కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. రేవంత్ అంటేనే బ్లాక్ మెయిలర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి పారిశ్రామికవేత్తలను బెదిరించిన చరిత్ర రేవంత్ ది అని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అడుగుతోన్న కళాశాలను రేవంత్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్ ప్రారంభించిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను కేసీఆర్ కొనసాగించారని గుర్తుచేశారు. హైడ్రా విషయంలో డిప్యూటీ సీఎం భట్టి, సీఎం బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ హరీష్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు మర్రి జనార్థన్ రెడ్డి, రవీందర్ రావు ఇంటిపై దాడులను మాజీ మంత్రి ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను బెదిరిస్తోందన్నారు. కాంగ్రెస్ అరాచకాలపై 20 ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. హోంమంత్రిగా, విద్యామంత్రిగా, మున్సిపల్ మంత్రిగా.. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అట్టర్ ఎలాప్ అంటూ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రిపై రోజుకో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉత్తరాలు రాస్తున్నారని.. సొంత ప్రభుత్వంపై ముఖ్యమంత్రికి పట్టు లేదంటూ విమర్శలు గుప్పించారు. రేవంత్ హయాంలో క్రైం రేటు పెరిగిందన్నారు. కమిషన్ల కోసం కమాండ్ కంట్రోలు సెంటర్‌లో సీఎం సమీక్షలు చేస్తున్నారని మాజీమంత్రి ఆరోపించారు. బీజేపీ నుంచి 8 మంది ఎంపీలు గెలిచినా తెలంగాణకు తెచ్చింది గుండు సున్నా అంటూ వ్యాఖ్యలు చేశారు. నవీన్ యాదవ్ తమ్ముడు వెంకట్ యాదవ్‌కు మూడు ఓట్లు ఉన్నాయన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల తాట తీస్తా

(మొదటి తరువాయి)

వారితో చర్చలు ఎలా ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఫీజురీయంబర్స్‌మెంట్‌పై ప్రైవేటు విద్యాసంస్థలు ఇటీవల బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రభుత్వం వెంటనే ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశాయి. లేకపోతే నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించాయి. తెలంగాణ ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలను కొనసాగించడం చాలా కష్టంతో కూడుకున్నదని ప్రైవేటు విద్యాసంస్థలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు విద్యాసంస్థలపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయినట్లు తెలుస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ తెలంగాణలో ఉన్నత విద్యాసంస్థలు చేపట్టిన బంద్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. విడతల వారీగా బకాయిలు చెల్లిస్తామన్నారు. మా హయాంలోని బకాయిలు ముందు చెల్లిస్తాం గతంలో ఉన్న బకాయిలపై చర్చిస్తామని అన్నారు.అయితే బందులతో విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడొద్దన్నారు. ఇలా చేయడం విద్యార్థులపై ప్రభావం చూపదా అని అన్నారు. బకాయిలు ఇవాళ కాకపోతే రేపు వసూలవుతాయి. కాలేజీలు బంద్ పెడితే విద్యార్థులు కోల్పోయిన సమయం తిరిగి వస్తుందా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులకు ఇబ్బంది లేదు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ వెళ్లాలి. రాష్ట్రానికి నెలకు రూ.18వేల కోట్ల ఆదాయం వస్తోంది. జీతాలు, వడ్డీలు, ఇతర ఖర్చులు పోనూ మిగిలేది రూ.5వేల కోట్లే. ఈ ఆదాయంతో రాష్ట్రాన్ని ఎలా నడపాలో చెప్పండి. ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారా? కాలేజీలను బంద్ చేయించినవారితో చర్చించేదేముంది? ఏ కాలేజీ ఎంత డొనేషన్ వసూలు చేస్తుందో నాకు తెలుసు. కాలేజీలో నిబంధనలు పాటించకపోతే ఎలా? ఇష్టానుసారం ఫీజులు పెంచుకుంటూ పోతే ఎలా? విద్య వ్యాపారం కాదు.. విద్యను సేవగా భావించాలి. రాజకీయ నేతలు అండగా ఉన్నారని విద్యార్థులతో ఆడుకోవద్దు. అడ్డగోలుగా ఫీజులు పెంచుకుని వచ్చి రీయింబర్స్‌మెంట్ అడుగుతున్నారు. కాలేజీలకు అనుమతుల విషయంలో ఎన్నో అక్రమాలు ఉన్నాయి. కాలేజీల యజమానులు ప్రభుత్వాన్నే బ్లాక్ మెయిల్ చేస్తారా? బీసీ నేత ఆర్.కృష్ణయ్య కూడా అమాయకంగా వాళ్ల ఉచ్చులో పడ్డారు. ఆర్.కృష్ణయ్య, మందకృష్ణ ముందుకొస్తే వాళ్ల చేతికే చిట్టా ఇస్తా. నాలుగు నెలలు ప్రభుత్వాన్ని మీరే నడపండని సీఎం అన్నారు.

## రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

(మొదటి తరువాయి)

నష్టపోయిన రైతులను ఆదుకున్నాం. మేం వచ్చాక పంటల బీమా చెల్లించి రైతులకు అండగా నిలిచాం. పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకున్నాం. పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు ఇస్తున్నాం అని వివరించారు. జలాశయాల్లో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టులకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నాం. రాయలసీమలో అన్ని రిజర్వాయర్లు పూర్తి చేశాం. కరవును శాశ్వతంగా నివారించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టాం. తరచుగా వచ్చే తుపాన్ల వల్ల కూడా రైతులు నష్టపోతున్నారని సీఎం చంద్రబాబు అన్నారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో ప్రాజెక్టుల నిర్వాహణని గాలికొదిలేశారని, కనీసం గేట్లకు గ్రీజు కూడా పెట్టలేదని చంద్రబాబు నాయుడు ఆరోపించారు. 2014 నుంచి 2019 మధ్యలో వ్యవసాయ రంగంలో జీఎస్డీపీ 6 శాతం పైగా పెరిగిందని.. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జీఎస్డీపీ మళ్లీ పడిపోయిందని ఆక్షేపించారు.రైతులకు పంటల బీమా చెల్లింపులో ఇబ్బంది లేకుండా చేశామని చెప్పుకొచ్చారు. కౌలు రైతులు ఎక్కువ భూమిలో వ్యవసాయం చేస్తున్నారని.. నష్టాలు వస్తే ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు.ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతితో పాటు వందేమాతరం 150 వసంతాల వేడుకలు ఒకే రోజు రావటం చరిత్ర అని అభివర్ణించారు. ఆచార్య ఎన్జీ రంగా 33 ఏళ్ల వయస్సులో ఆంధ్రా రైతాంగ ఉద్యమాన్ని నడిపించారని కొనియాడారు. 1964లో రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని పార్లమెంట్‌లో ఆచార్య ఎన్జీ రంగా పోరాడారని కీర్తించారు. ప్రాంతాలకు అతీతంగా నాలుగుచోట్ల ఎంపీగా గెలిచిన చరిత్ర ఆచార్య ఎన్జీ రంగాది అని ప్రశంసించారు. స్వాతంత్య పోరాటంలో పాల్గొన్న ప్రముఖుల్లో ఎన్జీ రంగా ఒకరని చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు.

## ఫీజు రియంబర్స్‌మెంట్ ఎత్తేసే కుట్ర

(మొదటి తరువాయి)

బకాయిలు చెల్లిస్తామని టోకెన్లు ఇచ్చి మోసం చేసింది నిజం కాదా? అని నిలదీశారు. బకాయిలు చెల్లించకుండా కాలేజీలను మోసం చేస్తోంది నిజం కాదా? అని అన్నారు. శుక్రవారం బీజేపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతే... మరి టోకెన్లు ఎందుకు ఇచ్చినట్లు? అని ప్రశ్నించారు. రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా ఎందుకు హామీ ఇచ్చారని నిలదీశారు. చట్టసభలో ఇచ్చిన హామీకే విలువ లేకుంటే ఇక అసెంబ్లీకి విలువ ఏముందని అడిగారు. సార్వత్రిక ఎన్నికలకు ముందే తెలంగాణ రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని రేవంత్‌రెడ్డే చెప్పారు కదా? అని గుర్తుచేశారు. ఇప్పుడు అందుకు భిన్నంగా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోతే కాలేజీలు ఎలా నడవాలని నిలదీశారు బండి సంజయ్. అధ్యాపకులకు జీతాలివ్వకపోతే విద్యార్థులకు చదవు చెప్పేదెవరు..? అని అడిగారు. కాలేజీ యాజమాన్యాలపై సీఎంకు ఉన్న కోపంతో.. విద్యార్థుల జీవితాలను బలి చేయాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. చట్టం పేరుతో బెదిరింపులకు పాల్పడితే పాలన నడవదనే విషయాన్ని సీఎం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించి చట్టం గురించి మాట్లాడితే మంచిదని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగిస్తారా? ఎత్తి వేస్తారా? ప్రజలకు స్పష్టం చేయాలని పేర్కొన్నారు.

## మత్స్యకారుల రాష్ట్ర బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ




**కరీంనగర్, నవంబర్ 07(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలు నవంబర్ 25 -27 తేదీల్లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. నవంబర్ 25న గీత భవన్ చౌరస్తా నుంచి రెవిన్యూ గార్డెన్ వరకు మత్స్యకారుల మహా ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుంది. ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 500 మంది ప్రతినిధులు, వేలాది మంది మత్స్యకారులు హాజరుకానున్నారు. చెరువుల లీజుల తగ్గింపు, ఉచిత చెప పిల్లలు, ఎక్స్ గ్రేషియో, మొబైల్ మార్కెటింగ్ వాహనాలు వంటి హక్కుల సాధన కోసం సంఘం గత 25 ఏళ్లుగా పోరాటం చేస్తోంది. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో చేతి ధర్మయ్య, లెల్లెల బాలకృష్ణ, డోలి రాజయ్య, జునగరి గణేష్, పిట్టల వెంకటేశం, పప్పు సదానందం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 'వందే మాతరం' 150 ఏళ్ల వార్షికోత్సవం




**బాలానగర్, నవంబర్ 07(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జాతీయ గేయం 'వందే మాతరం' 150వ వార్షికోత్సవాన్ని బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా నిర్వహించారు. సీఐ నర్సింహా రాజు నేతృత్వంలో సిబ్బందితో కలిసి గేయాన్ని సామూహికంగా ఆలపించి, బంకించంద్ర ఛటర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సరితా రెడ్డి, హాజీ మియా, వినోద్ కుమార్ పాల్గొన్నారు. "1875 నవంబర్ 7న రచించిన ఈ గేయం దేశ ఐక్యతకు, స్వాతంత్ర్యోద్యమానికి స్ఫూర్తి" అని సీఐ పేర్కొన్నారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన డీసీఎం




**షాద్ నగర్, నవంబర్ 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆరాంఘర్ చౌరస్తా వద్ద శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. షాద్ నగర్ నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులోని పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడినవారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు.
సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇటీవల వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

## 'వందేమాతరం' 150 ఏళ్ల సందర్భంగా గీతాలాపన



**ఆమనగల్లు, నవంబర్ 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ గేయం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆమనగల్లు మున్సిపాలిటీ అటల్ బిహారీ వాజ్పేయి చౌరస్తాలో సామూహిక గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నరసింహ, మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.'వందేమాతరం స్వాతంత్ర్యోద్యమానికి రణ నినాదంలా నిలిచింది. భావి తరాలకు ఈ గేయ స్ఫూర్తిని అందించాల్సిన బాధ్యత మనదే" అని గోరటి నరసింహ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెక్కల లక్ష్మణ్, శ్రీశైలం, నరేందర్ రాథోడ్, జంగయ్య, మల్లేష్, ఆనంద్, శ్రీనివాస్, సందీప్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా ఉప్పల్‌లో ప్రత్యేక కార్యక్రమం



**ఉప్పల్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాచకొండ ట్రాఫిక్ పోలీసులు ఉప్పల్ రింగ్ రోడ్ జంక్షన్‌లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సీపీ సుధీర్ బాబు సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమానికి డీసీపీ ట్రాఫిక్ డీ. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, "1875 నవంబర్ 7న బంకిమ్ చంద్ర చాటర్జీ వందేమాతరం గేయాన్ని రచించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారత ప్రభుత్వం దీనిని జాతీయ గీతంగా స్వీకరించింది. అహింసా సాయుత భారత ఉద్యమంలో ఇది రాణా నినాదంగా ఉపయోగపడింది" అని పేర్కొన్నారు.అనంతరం విద్యార్థులతో కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఏడిసిపి లక్ష్మి, ఏసీపీ ఎం.వి. శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు నాగరాజు, మధు, భాస్కర్, లిటిల్ ఫ్లావర్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ పై ఆరా తీసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్లగొండ, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ జరిగినట్లు మీడియాలో వచ్చిన వార్తలపై జిల్లా కలెక్టర్ శుక్రవారం స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి లతో కలిసి ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, హెచ్ ఓ డి లు,అధ్యాపక బృందం, విద్యార్థి సంఘాల నాయకులు, మెంటర్లు, విద్యార్థులతో ఆమె విడివిడిగా చర్చించారు. మీడియాలో వచ్చిన వార్తల దృష్ట్యా నిజంగా వైద్య కళాశాలలో జరిగిన సంఘటనలను వివరించాలని ఆమె విద్యార్థులను అడిగారు.తమను ఎవరు ర్యాగింగ్ చేయ లేదని, స్నేహపూర్వక వాతావరణంలోనే తాము ఉన్నామని విద్యార్థులు జిల్లా కలెక్టర్ కు వివరించారు.

## ఫంక్షన్ హాల్‌లలో ప్లాస్టిక్ నిషేధం

### -కమిషనర్ మల్లికార్జున్



**హుస్నాబాద్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పట్టణంలోని ఫంక్షన్ హాల్ యజమానులు, శుభకార్య నిర్వాహకులతో పురపాలక సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కమిషనర్ టి. మల్లికార్జున్ మాట్లాడుతూ, "ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించాలి. మెప్మా ఆధ్వర్యంలోని స్టీల్ బ్యాంకులను వినియోగించాలి. ఉల్లంఘనకు రూ.10,000 జరిమానా లేదా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. సమావేశంలో సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, ఫంక్షన్ హాల్ నిర్వాహకులు క్యాస రామ్, లక్ష్మారెడ్డి, బి. రాజయ్య, దేవేందర్ రెడ్డి, బత్తిని మహేందర్, కనకయ్య, క్రిష్టయ్య, సమత, జవాన్‌లు సారయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు: ఎస్ఎఫ్ఐ



**హుస్నాబాద్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ ఫీజులను సకాలంలో విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నదని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ విమర్శించారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. "ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న 8400 కోట్ల స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి. కళాశాలలు స్వచ్ఛందంగా బంద్ చేసినా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరం" అని అన్నారు. పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని, ఒకేసారి పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కిషోర్, మహేష్, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న మైసిగండి మైసమ్మ ఉత్సవాలు



**కడ్తాల్, నవంబర్ 7 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ అమ్మవారి ఉత్సవాలు శుక్రవారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్ పర్సన్ సిరోలి పంతు, ఈఓ శ్నేహలత, తహశీల్దార్ జ్యోతి, శ్రీరాములు, అమృ నాయక్, పాండు నాయక్, జావర్ లాల్, లింగప్ప, భాస్కర్, అరుణ్, ఉప ప్రధాన అర్చకులు యాదగిరి, పూజారులు అమూల్యపాటి, సంతోష్ శర్మ, జైనన్ ప్రకాష్, వెంకటరమణ, బిచ్యా నాయక్, శ్రీరాములు, ఆలయ సిబ్బంది కృష్ణ, చంద్రయ్య, రాములు, శ్రీనివాసులు, శ్రవణ్, వెంకటేష్, రవి, భక్తులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి: సిహెచ్ యాదయ్య



**మహేశ్వరం, నవంబర్ 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో మహేశ్వరం నియోజకవర్గం నాయకులు విశేషంగా పాల్గొన్నారు. కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు, మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేతృత్వంలో 282వ బూత్ పరిధిలోని పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ ప్రచారంలో యువ నాయకుడు నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా, కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రజలకు ప్రభుత్వ పథకాల వివరాలు అందించారు. మహేశ్వరం నియోజకవర్గం బిసి సెల్ మండల్ అధ్యక్షుడు బొల్లు కుమార్, ఐఎన్టీయూసీ అధ్యక్షుడు నడుకుడా శివ, మండల కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఎర్ర నవీన్ కుమార్, మాజీ ఎంపీటీసీ వడ్డేమోని దాసు, మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు సిహెచ్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కోసం నవీన్‌కి ఓటేయండి: నడికుడా శివ



**మహేశ్వరం, నవంబర్ 07(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా మహేశ్వరం నియోజకవర్గం నేతలు ప్రచారం నిర్వహించారు. ఐఎన్టీయూసీ అధ్యక్షుడు నడికుడా శివ మాట్లాడుతూ "కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ. ఉచిత బస్, 500 గ్యాస్, 200 యూనిట్ల విద్యుత్, సన్న బియ్యం వంటి పథకాలు అమలయ్యాయి. జూబ్లీహిల్స్ అభివృద్ధికి నవీన్‌కి మద్దతు అవసరం" అని ఓటర్లను కోరారు.

## విలేకరుల పిల్లలకు ఫీజు రాయితీ కోరిన పద్మారావు



**మల్కాజ్గిరి, నవంబర్ 07(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అన్వేషణ ప్రతినిధి ఈ. పద్మారావు కాపు మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా డిఈఓ ఐ. విజయకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. విలేకరుల పిల్లలకు స్కూల్ ఫీజులో రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. "జర్నలిస్టులు ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చే బాధ్యతను నిర్వర్తిస్తారు. వారి పిల్లల విద్యకు చిన్న సహాయం కూడా పెద్ద ప్రోత్సాహమే" అని తెలిపారు.డిఈఓ ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించి, పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

# జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన ఇర్విన్ విద్యార్థుల బృందం









**మాడుగుల, నవంబర్ 7(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
టీసాట్- టీజీహెచ్ఎంఎ వార్షిక విద్యార్థి పోటీల్లో మాడుగుల మండల కేంద్రంలో నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పి.ఎం. జెడ్పిహెచ్ఎస్ ఇర్విన్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో ప్రథమ స్థానాలు సాధించారు. ఈ విజయంతో వారు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థుల విజయం పట్ల ప్రధానోపాధ్యాయులు లండం పర్వతాలు, గైడ్ టీచర్ విగ్నేశ్వర్, ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# తూప్రాన్‌లో 'వందేమాతరం' 150వ వార్షికోత్సవం




**తూప్రాన్, నవంబర్ 07(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జాతీయ గేయం 'వందేమాతరం' 150 ఏళ్ల సందర్భంగా తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.
గౌరవ మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది సామూహికంగా 'వందేమాతరం' గేయాన్ని ఆలపించారు.

# తూప్రాన్‌లో ఇంటింటికి చెత్త డబ్బాల పంపిణీ



**తూప్రాన్, నవంబర్ 07(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రజా ఆరోగ్య పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన శుభ్రత కార్యక్రమంలో భాగంగా తూప్రాన్ పురపాలక సంఘ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో ఇంటింటికి రెండు చెత్త డబ్బాలను పంపిణీ చేశారు. తడి, పొడి చెత్తను వేరు చేయాలన్న లక్ష్యంతో గౌరవ మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్య చేపట్టారు. బయట చెత్త పారవేయకుండా ఇంట్లోనే వేరు చేయడం ద్వారా శుభ్రతతో పాటు ఆరోగ్య పరిరక్షణకు ఇది దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

# ఎల్లమ్మ దేవాలయానికి ఫ్యాన్ బహూకరణ



**ఎలిగేడు, నవంబర్ 07(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నర్సాపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ దేవాలయానికి సీలింగ్ ఫ్యాన్‌ను బహూకరించారు. ఎలిగేడు కేంద్రానికి చెందిన రాఘవేంద్ర ఫర్టిలైజర్ ప్రోప్రైటర్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశెట్టి రాఘవేంద్ర ఈ ఫ్యాన్‌ను గౌడ సంఘం అధ్యక్షుడు పల్లెర్ల వెంకటయ్య గౌడ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్లెర్ల వెంకటేష్ గౌడ్, మొగిలి, స్వామి, కాటా రవీందర్ గౌడ్, తాటిపల్లి సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పిహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభకు వేదిక



**మానకొండూరు, నవంబర్ 07(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
టీ సాట్ మరియు తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయాలన్న సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా బాల వక్త, వ్యాసరచన, క్విజ్ పోటీలను మూడు స్థాయిల్లో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మానకొండూరు మండల కేంద్రంలో శుక్రవారం మండల స్థాయి పోటీలు ఘనంగా జరిగాయి. పోటీలను ప్రారంభించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నల్లమోతు సుదర్శన్ మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ ఉంది. వారి సామర్థ్యాన్ని వెలికితీయడమే ఈ పోటీల ఉద్దేశ్యం" అని పేర్కొన్నారు. మండల విద్యాధికారి మధుసూదనాచారి మాట్లాడుతూ, "ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయి. అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనడం అభినందనీయం" అని అన్నారు. జెడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ, "ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ పోటీల ద్వారా విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకుంటున్నారు. ఉపాధ్యాయులు కూడా తర్ఫీదు విషయంలో పూర్తి సహకారం అందిస్తున్నారు" అని తెలిపారు. బాల వక్త పోటీలో జెడ్పిహెచ్ఎస్ మానకొండూర్‌కు చెందిన రాఘవేంద్ర ప్రథమ స్థానం, జెడ్పిహెచ్ఎస్ గర్ల్స్ మానకొండూర్‌కు చెందిన విష్ణు శ్రీ ద్వితీయ స్థానం, జెడ్పిహెచ్ఎస్ అన్నారంకు చెందిన హరిణి తృతీయ స్థానం సాధించారు.
వ్యాసరచనలో జెడ్పిహెచ్ఎస్ గర్ల్స్ మానకొండూర్‌కు చెందిన శైలి, జెడ్పిహెచ్ఎస్ వెల్దికి చెందిన అక్షయ, జెడ్పిహెచ్ఎస్ కొండపలకలకు చెందిన ఉషశ్రీ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. క్విజ్ పోటీలో జెడ్పిహెచ్ఎస్ అన్నారంకు చెందిన సంగీత, జెడ్పిహెచ్ఎస్ పచ్చునూరుకు చెందిన స్నేహ, ఆరాధ్య విజేతలుగా నిలిచారు. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలల ఉపాధ్యాయులు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలంటూ విద్యార్థుల ధర్నా

**- ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడి**



**కల్వకుర్తి, నవంబర్ 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద వైఖరికి నిరసనగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. మహబూబ్‌నగర్ చౌరస్తా వద్ద రోడ్డుపై ధర్నా అనంతరం ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడించారు. పీడీఎస్యూ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ పెండింగ్‌లో ఉండటంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవేటు డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ కాలేజీలు బంద్ నిర్వహిస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే అసెంబ్లీ ముట్టడికి దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్, ఏ ఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్, విద్యార్థి నాయకులు వినోద్, కార్తీక్, అనిల్, అంజి, మల్లేష్, రామ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ కార్యాలయంలో వందేమాతర సామూహిక గీతాలాపన

**- కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నల్లగొండ ,నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పౌరులలో దేశభక్తి భావనను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వందేమాతర జాతీయ గీతం సామూహికాలాపన కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శుక్రవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయావరణలో కలెక్టర్ కార్యాలయ సిబ్బందితోపాటు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో వందేమాతరం జాతీయ గీతాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, నల్గొండ ఆర్డిఓ వై .అశోక్ రెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఏ ఓ మోతిలాల్, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా గీతాలాపన



**మనోహరాబాద్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్వాతంత్ర్య సమరంలో జాతిని జాగృతం చేసిన ప్రేరణా గీతం 'వందేమాతరం' 150 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాతీయ గేయం ఆలపించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రూపా గౌడ్, పిహెచ్సి డాక్టర్ స్వప్న, ఏఎన్ఎం వినోద, గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ నెల 9న చెస్ ఛాంపియన్షిప్

**కరీంనగర్, నవంబర్ 7(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కరీంనగర్ నగరంలోని కోతి రాంపూర్ ప్రాంతంలో ఈ నెల 9వ తేదీన జూనియర్స్ చెస్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు విశ్వనాథ్ చెస్ అకాడమీ డైరెక్టర్ అంతగిరి విశ్వనాథ్ ప్రసాద్, సమాఖ్య బాధ్యులు అంతగిరి రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమనేని గార్డెన్స్‌లో నిర్వహించనున్న ఈ పోటీలు స్విస్ లీగ్ పద్ధతిలో జరుగనున్నాయి. అండర్ 18, అండర్ -14, అండర్-12, అండర్-10 విభాగాల్లో పోటీలు నిర్వహించబోతున్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా ట్యాబ్, ద్వితీయ బహుమతిగా సైకిల్, తృతీయ బహుమతిగా స్మార్ట్ వాచ్ అందజేయనున్నారు. అలాగే ప్రతిభ కనబరిచిన చిన్న వయసు క్రీడాకారులకు స్కూల్ బ్యాగులు బహుమతిగా ఇవ్వనున్నారు. పోటీ సందర్భంగా ఫార్చున్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయనున్నారు. ఈ క్యాంపులో 2డీ ఈకో, ఈసీజీ, బీపీ, షుగర్ టెస్టులు క్రీడాకారులు మరియు వారి తల్లిదండ్రులకు ఉచితంగా నిర్వహించనున్నారు. ఈ పోటీలకు 18 సంవత్సరాల లోపు ఉన్నవారు అర్హులు. ఎంట్రీ ఫీజు రూ. 499 ను ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా 8వ తేదీ లోగా 7569229294 నంబరుకు చెల్లించి నమోదు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు 7569229294 లేదా 9030177607 నంబర్లలో సంప్రదించవచ్చు.

# ఉత్తమ రైతుగా కొనల కవితకు పురస్కారం



**రాజేంద్రనగర్, నవంబర్ 07(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ రాజేంద్రనగర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మంచాల గ్రామానికి చెందిన కొనల కవిత రాములు ఉత్తమ రైతు పురస్కారాన్ని అందుకున్నారు. తన వ్యవసాయ భూమిలో ధన్ ధన్ -48 రకం వరి సాగు చేయడంతో పాటు కూరగాయలు పండించి అధిక దిగుబడి సాధించినందుకు ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి మంచాల గ్రామం నుంచి 26 మంది రైతులు హాజరయ్యారు. ఎర్పుల నరసింహ, అశ్వాల బాల్ రాజ్, ఎర్పుల భాష, గౌరియ భాషయ్య, గౌరిగే యాదయ్య, బంగారుగళ్ల వీరయ్య, చీర దానయ్య, లింగయ్య, పుల్లయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త హతుల్ వారిస్ సహా పలువురు నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సోమశిల -శ్రీశైలం లాంచీ ప్రయాణానికి శ్రీకారం



**కొల్లాపూర్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సోమశిల -శ్రీశైలం మధ్య క్రూయిజ్ లాంచీ ప్రయాణాన్ని శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నారు. కొల్లాపూర్ పట్టణ పరిధిలోని సోమశిల నుంచి 80 మంది పర్యాటకులతో ఈ ప్రయాణం ప్రారంభం కానుంది. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు నాగర్‌కర్నూలు జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని కవర్ చేయాలని నిర్వాహకులు కోరారు.

# మహబూబాబాద్ కలెక్టరేట్‌లో 'వందేమాతరం' గీతాలాపన





**మహబూబాబాద్, నవంబర్ 07(నీలగిరి ఎక్స్ ప్రెస్):** జాతీయ గీతం 'వందేమాతరం' 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ ప్రజల్లో ఐక్యత, దేశభక్తి భావాలను పెంపొందించేందుకు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సామూహిక గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్, వత్సల్ టొప్పో, అనిల్ కుమార్‌లు కలెక్టరేట్ ఉద్యోగులతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'వందేమాతరం' గేయాన్ని ఆలపించారు. అదే తరహాలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ -ప్రైవేట్ పాఠశాలల్లో కూడా సామూహిక గీతాలాపన నిర్వహించారు.స్వాతంత్ర్య పోరాటంలో 'వందేమాతరం' గేయం ఉద్యమకారులకు మనోబలాన్ని ఇచ్చిన ప్రేరణా శక్తిగా నిలిచిందని, సామాన్యులను సమరయోధులుగా మార్చిన గీతమిదని అధికారులు పేర్కొన్నారు. మహాకవి బంకించంద్ర చటర్జీ రచించిన 'ఆనంద్ మఠ్' నవలలో ఈ గేయం భాగంగా పొందుపరచబడిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## తూడుకుర్తిలో 'వందేమాతరం' 150వ వార్షికోత్సవం





**నాగర్‌కర్నూల్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వందేమాతర గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తూడుకుర్తి గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు B. రఘు అధ్యక్షతన విద్యార్థులు, ఉపాధ్యాయులు గేయ విశిష్టతపై చర్చించేందుకు సమావేశమయ్యారు.ఈ సందర్భంగా వక్త శ్రీ గోపాలాచారి మాట్లాడుతూ, బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గేయం స్వాతంత్ర్య ఉద్యమంలో దేశాన్ని ఉర్రూతలూగించిన ప్రేరణా శక్తిగా నిలిచిందని వివరించారు. దేశభక్తి పెంపొందాలంటే ప్రతి ఒక్కరూ ఈ గేయాన్ని ఆలపించి దాని అర్థాన్ని తెలుసుకోవాలని, భారతదేశ సౌందర్యం, సంపద ఈ గీతంలో ప్రతిబింబించిందని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.కార్యక్రమంలో సత్యనారాయణ, శ్రీ అంజయ్య, సఫియా సుల్తానా, విమలాదేవి, కృష్ణమోహన్, ప్రకాష్ బాబు, ప్రసాద్, వెంకట నరసింహారెడ్డి, పద్మమ్మ, రాధ, గోపాలాచారి, స్వరూప రాణి, శ్రీలత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం: బొడ్ల శ్రీరాములు



బొడ్ల శ్రీరాములు

**కరీంనగర్, నవంబర్ 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్మెంట్ విషయంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని బీజేపీ కరీంనగర్ జిల్లా నాయకుడు బొడ్ల శ్రీరాములు తీవ్రంగా విమర్శించారు. ప్రైవేట్ ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ, ఫార్మసీ కళాశాలలకు రావాల్సిన ట్యూషన్ ఫీజు విడుదల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు."దీపావళి వరకు 50 శాతం ఫీజు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. కళాశాలలు బంద్‌కు దిగిన పరిస్థితిలో విద్యార్థులు రోడ్డుపైకి రావాల్సి వస్తోంది. హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు సొంత గ్రామాలకు వెళ్లిపోతున్నారు. ఇది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడడమే," అని బొడ్ల శ్రీరాములు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని, దీనికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. "ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్‌ను పూర్తిస్థాయిలో విడుదల చేయాలి. లేకపోతే విద్యార్థి ఉద్యమం ఉధృతమవుతుంది," అని హెచ్చరించారు.

## భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డుల పంపిణీ



**మహబూబాబాద్, నవంబర్ 07(నీలగిరి ఎక్స్ ప్రెస్):** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పథకాలలో భాగంగా అసంఘటిత రంగ కార్మికులకు లేబర్ కార్డుల పంపిణీ కార్యక్రమం మహబూబాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా నిర్వహించారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న అర్హులైన కార్మికులు న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించడంతో, వారి సహకారంతో లేబర్ కార్డులు అందజేశారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు చెందిన చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి నాగేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నిర్మాణ రంగంలో పనిచేసే ప్రతి కార్మికుడు తప్పనిసరిగా లేబర్ కార్డు తీసుకోవాలి. ఈ కార్డు ద్వారా కార్మికులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వ పథకాల లబ్ధి అందుతుంది. ఏజెంట్లను ఆశ్రయించకుండా నేరుగా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే, కార్మిక శాఖతో సమన్వయం చేసి కార్డులు అందజేస్తాం" అని తెలిపారు.నిర్మాణ రంగంలో ఇతర పనులు చేసే కార్మికులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజ్ కృష్ణ, న్యాయవాది మోహన్, కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్ పిట్టల బుచ్చిరామారావు, పార లీగల్ వాలంటీర్లు మేకల శ్రీనివాసు, కమటం యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీకి సమయానికి రక్తదానం చేసిన యువశక్తి ఫౌండేషన్



**వనపర్తి నవంబర్ 07( నీలగిరి ఎక్స్ ప్రెస్):** నిండు గర్భిణీ స్త్రీకి అరుదుగా దొరికే ఏ నెగటివ్ బ్లడ్ రక్తదానం చేశామని యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు తెలిపారు. వివరాల్లోకి వెళితే వనపర్తి జిల్లా కేంద్రం అంజనగిరి ప్రాంతానికి చెందిన రూప డెలివరీ కోసం వనపర్తి గవర్నమెంట్ హాస్పిటల్ అడ్మిట్ అవ్వడం జరిగింది. ఆమెకు వెంటనే ఏ నెగటివ్ బ్లడ్ ఎక్కించాలని డాక్టర్స్ నిర్ధారించడంతో ఉమ్మడి పాలమూరు జిల్లా బ్లడ్ బ్యాంకుల్లో లేకపోవడంతో కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్ కి సమాచారం తెలుపగా వెంటనే స్పందించి ఫౌండేషన్ మెంబెర్ నాగవర్ధన్ తో రక్తదానం చేయడం జరిగింది. అనంతరం బాబు పుట్టడంతో కుటుంబ సభ్యులు నాగవర్ధన్ కు అభినందనలు తెలిపారు. ఆరోగ్యవంతమైన యువతి యువకులు బ్లడ్ అవసరం ఉన్నప్పుడు వెంటనే స్పందించి రక్తదానం చేయాలని యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షులు కాగితాల మధు తెలిపారు ఈ కార్యక్రమంలోయువశక్తి ఫౌండేషన్ మెంబెర్స్, ఓల్డ్ ఏజ్ హోమ్ ఆర్గనైజర్ రాము కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ల కళాశాల ప్రెషర్స్ డే



**మహబూబాబాద్, నవంబర్ 07(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక కళాశాలలో శుక్రవారం ప్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహభరితంగా జరిగాయి. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో కళాశాల ఆవరణను సందడిగా మార్చారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బాలరాం నాయక్ మాట్లాడుతూ, "ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి. తల్లి తండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావడం విద్యార్థుల బాధ్యత" అని సూచించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి కళాశాల తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.విద్యార్థులు తమ సృజనాత్మకతను, నైపుణ్యాలను ప్రదర్శించిన ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## కళ్ళుండి చూడలేని గుడ్డి ప్రభుత్వం కళ్లు తెరవాలి

### విద్యార్థి సంఘాల ఆగ్రహ ర్యాలీ





**వనపర్తి నవంబర్ 07( నీలగిరి ఎక్స్ ప్రెస్):** విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, బీసీ విద్యార్థి సంఘం, పీడీఎస్‌యూ, టిఆర్ఎస్వి, ఎంఎస్ఎఫ్, బిఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళ్ళకు గంతలు కట్టి "గుడ్డి ప్రభుత్వం కళ్లు తెరవాలి" అంటూ నిరసన తెలిపారు. విద్యార్థి నాయకులు రమేష్, అరవింద్, గణేష్, హేమంత్, పరశురాములు, నరేష్ తదితరులు రేవంత్ ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న రూ.8300 కోట్ల బకాయిలను విడుదల చేయాలని, లేకపోతే ఉద్యమం తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు.

## యువజనోత్సవాల కోసం జిల్లా స్థాయి కళాకారుల ఎంపిక



**మహబూబాబాద్, నవంబర్ 07(నీలగిరి ఎక్స్ ప్రెస్):** జాతీయ యువజనోత్సవాల నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా స్థాయి యువకళాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 12న ఉదయం 9 గంటలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ఓలేటి జ్యోతి తెలిపారు.ఈ పోటీల్లో పాల్గొనదలచిన అభ్యర్థుల వయసు 15 నుండి 29 సంవత్సరాల మధ్య ఉండవలసి ఉంది. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారిని రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలకు ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు 2026 జనవరి 10 నుండి 12 వరకు న్యూఢిల్లీ లో జరిగే జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొననున్నారు.

## వందేమాతరం దేశ సమైక్యతకు ప్రతీక

### జంగంపల్లి వెంకట నరసయ్య



**సిద్ధిపేట, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జయశంకర్ స్టేడియంలో జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి జంగంపల్లి వెంకట నరసయ్య మాట్లాడుతూ, "వందేమాతరం గీతం బెంగాల్ విభజనకు అవరోధంగా నిలిచి దేశ సమైక్యతను చాటింది" అని పేర్కొన్నారు. యువజన అవార్డు గ్రహీత వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ, "నేటి యువత జాతీయత భావాలను పునికి పుచ్చుకోవాలి. మహనీయుల జీవిత చరిత్రను పఠించాలి" అని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, స్పోర్ట్స్ విద్యార్థులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం



**కడ్తాల్, నవంబర్ 7 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారి కడ్తాల్ మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం..కడ్తాల్ మండలం రావిచెడ్ గ్రామానికి చెందిన శేరి చిన్నయ్య ( 60 ) అనే వృద్ధుడు కడ్తాల్ పట్టణంలో నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్నయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుని తమ్ముడి కుమారుడు మహేష్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

# పిల్లల చిన్న ప్రపంచం తల్లిదండ్రుల పెద్ద బాధ్యత

## ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి

**వనపర్తి నవంబర్ 07( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** పాఠశాలలో పూర్వపు (ప్రీస్కూల్) పిల్లల విద్య అనేది సాధారణమైనది కాదనిపిల్లలకు ఇది జీవితపు పునాది అని, ఆ చిన్న విద్య ప్రపంచమే తల్లిదండ్రులకు ఒక పెద్ద బాధ్యత అని తపస్విని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగవరం రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులకు, ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ఎలా తోడ్పాటు కావాలనే అంశంపై ఆయన మాట్లాడుతూ, "మన పిల్లల జీవితంలో మొదటి పాఠం, మొదటి అక్షరం, మొదటి స్నేహం, మొదటి ఆడిపాడే సంతోషం అన్నీ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలోనే మొదలవుతాయి" అన్నారు.నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ సాధారణ విద్య కాదు ఇది జీవితానికి పునాది వేసే దశ. పిల్లలకు పుస్తకాలు, ఆటలు, ప్రేమ, ప్రోత్సాహం ఇవన్నీ కలిసే "విద్య" అవుతుంది అని ఆయన వివరించారు. చిన్నారుల అభివృద్ధి చిన్న అడుగులతో మొదలవుతుంది కానీ అది పెద్ద ప్రయాణంగా మారుతుంది. ప్రతి పిల్లవాడు ఒక కొత్త ప్రపంచం. నర్సరీలో వారు అక్షరాలు నేర్చుకోవడం కంటే ఆలోచించడం నేర్చుకుంటారు. పదాలను పలకడం కంటే భావాలను వ్యక్తం చేయడం నేర్చుకుంటారు.పిల్లలు ఆటలతోనే నేర్చుకుంటారు ఒక బొమ్మను గిరగిరా తిప్పడం, మట్టిలో అక్షరం రాయడం, టీచర్ పాడిన పాటను తలచుకోవడం ఇవన్నీ చిన్నచిన్న పనుల్లా కనిపించినా, అవే భవిష్యత్తులో సృజనాత్మక ఆలోచనకు బాటలు వేస్తాయి అన్నారు.పిల్లలు పుస్తకంలోనే కాదు, ఉపాధ్యాయుల చూపుల్లోనూ నేర్చుకుంటారు. మన నవ్వు వారికి నమ్మకం ఇస్తుంది, మన కోపం భయాన్ని నేర్పుతుంది. కాబట్టి ప్రతి క్షణం నవ్వుతూ బోధించాలి అని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు.తల్లిదండ్రుల పాత్రలో ప్రేమే వారికి మొదటి పాఠశాల అని చెప్పారు. పిల్లల మొదటి గురువు టీచర్ కాదు తల్లి, తండ్రి. కాబట్టి మన



మాట, మన తీరు, మన అలవాట్లే వాళ్లకు మొదటి పాఠాలు అవుతాయి అని తల్లిదండ్రులకు సూచించారు.ఉపాధ్యాయులు కానీ తల్లిదండ్రులు కానీ పిల్లలకు కథలు చెప్పడం వల్ల కథలో ఉన్న బుద్ధి, ధైర్యం, నైతికత పిల్లల మనసులో విత్తనాలుగా వేస్తాయి. పాటలు, పద్యాలు నేర్పడం ద్వారా రాగం, లయతో నేర్చుకున్నవి ఎప్పటికీ మర్చిపోరు.మొబైల్ దూరంగా ఉంచండి ఇది చాలా మంచి అలవాటు అని అన్నారు. ప్రతి పిల్లవాడిని ఇంకొక పిల్లవాడితో పోల్చవద్దు. ఎప్పుడూ ప్రోత్సాహకంగా "నువ్వు చేయగలవు" అనే నమ్మకాన్ని కలిగించండి.
"వాడిలా ఎందుకు చదవలేదు?" అనకండి. "నువ్వు బాగా ప్రయత్నించావు" అని చెప్పండి. పిల్లలు మనల్ని ఎలా చూస్తారో, ఆ రూపంలోనే వాళ్లు ఎదుగుతారు. మన ప్రేమ, మన సహనం వాళ్లకు ప్రపంచాన్ని గెలిచే ధైర్యం ఇస్తుంది. పిల్లల అభివృద్ధి ఒకే వ్యక్తి కృషి కాదు టీచర్, తల్లిదండ్రులు, పాఠశాల ఇవన్నీ ఒక వలయంలా ఉండాలి. పాఠశాల కార్యక్రమాల్లో పాల్గొనండి. టీచర్లతో మాట్లాడండి పిల్లల బలాలు, బలహీనతలు తెలుసుకోండి. ఇంట్లో కూడా చిన్న చిన్న పాఠాలు నేర్పండి రంగులు, సంఖ్యలు, కథలు.పాఠశాల ఒక ఇల్లు అయితే, తల్లిదండ్రులు దాని గోడలు. ఇద్దరూ కలిసి నిలబడితేనే ఆ ఇల్లు బలంగా ఉంటుంది అని ఆయన అన్నారు. ఒకరోజు ఒక పిల్లాడు అక్షరాలు నేర్చుకోవడంలో కష్టపడుతున్నాడు. తల్లి కోపం చూపకుండా ప్రతిరోజూ ప్రేమగా అక్షరాలు చెప్పింది. మూడు నెలల తర్వాత పిల్లాడు మొదటిసారి "అమ్మ" అని రాశాడు. తల్లి కన్నీళ్లు పెట్టుకుంది ఆనందంతో. అది కేవలం అక్షరం కాదు అది ప్రేమ ఫలితం. ప్రతి పిల్లలో ఇలాంటివే అద్భుతాలు దాగి ఉంటాయి. వాటిని బయటకు తీయగల శక్తి మన ప్రేమ, మన సహనం, మన భాగస్వామ్యం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇద్దరి లక్ష్యం ఒకటే పిల్లలను ఉత్తమ పౌరులుగా, మంచి మనుషులుగా, మనస్సులుగా తీర్చిదిద్దడమే మన అందరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రీస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు తోపాటు తపస్విని పాఠశాల ఉపాధ్యాయినీలు స్వప్న, వరలక్ష్మి, ఉపాధ్యాయులు రామ్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలి

## నియోజకవర్గ ఇన్చార్జి ఇరగదిండ్ల కృష్ణ.



**దేవరకొండ నవంబర్ 07. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
ఎంతోకాలంగా అనేక ఇబ్బందులు పడుతున్న వడ్డెర సమాజం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వడ్డెర కులస్తుల వారి యొక్క పరిస్థితి దయనీయ పరిస్థితుల్లో బ్రతుకుతున్నారు అని అర్థం చేసుకొని తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి , వడ్డెర్ల కోరిక గత 25 సంవత్సరాల నుండి వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎన్నో బహిరంగ సభలో గతంలో పాలించిన అన్ని పార్టీల ముఖ్యమంత్రిలను మంత్రులు బృందాన్ని కోరినప్పటికీ వారి యొక్క డిమాండ్ నెరవేరలేదు తెలంగాణలో మా యొక్క గవర్నమెంటు అధికారంలోకి వస్తే తప్పకుండా అన్ని కోణాల ఆలోచించి అసెంబ్లీలో తీర్మానం చేసి ఎస్టీ జాబితాలో చేర్చడానికి 100% మా యొక్క ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని గత రెండు సంవత్సరాలు క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో రేవంత్ రెడ్డి ఎన్నో బహిరంగ సభలో అలాగే నల్లగొండ జిల్లా మునుగోడు బహిరంగ సభలో కూడా మాట ఇచ్చినారు .ఈ మధ్యకాలంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ట్రస్ట్ చైర్మన్ శివరాత్రి ఆయిల్ మల్లు ఆధ్వర్యంలో చాలామంది మంత్రివర్గ బృందాన్ని కలిశాము వారు కూడా సానుకూలంగా హామీ ఇచ్చినారు అయ్యా ముఖ్యమంత్రి గారు మా యొక్క కోరిక మన్నించి మమ్మల్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని కాంగ్రెస్ పార్టీపై పూర్తి విశ్వాసం నమ్మకంతో ఉన్నాము దయగలవారై మా యొక్క కోరికలను నెరవేర్చాలని నల్లగొండ జిల్లా వడ్డెర సంఘం దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు ఇరగ దిండ్ల కృష్ణ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# ప్రజలపై శ్రీ ఏకామ్రనాథుడి దయ సంపూర్ణంగా ఉండాలి

## - ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్



**మాణిక్యనగర్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కుత్బుల్లాపూర్ డివిజన్ మాణిక్యనగర్‌లోని శ్రీ కామాక్షి సమేత ఏకామ్రనాథ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం నవగ్రహ పునః ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా ఋత్వికులచే మహా కుంభాభిషేకాలు నిర్వహించగా, ఈరోజు నవగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ స్వామివారికి, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, "అతి మహిమాన్వితమైన శ్రీ కామాక్షి సమేత ఏకామ్రనాథ స్వామి దయ ప్రజలపై సంపూర్ణంగా ఉండాలి. ఈ దేవాలయం భక్తుల ఆధ్యాత్మిక శ్రేయస్సుకు మార్గదర్శిగా నిలుస్తోంది" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మాణిక్యనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బి. మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్, ఖలీల్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, జయేందర్ రెడ్డి, మధు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు సురేష్, సలహాదారులు రామేశ్వర్ రెడ్డి, ఇంద్రసేన రెడ్డి, నారాయణ రెడ్డి, బీమప్ప, దామోదర్ రెడ్డి, కాలనీ సీనియర్లు కె.బి.ఆర్. ప్రసాద్, డి. పోచయ్య, గోపాల్ రెడ్డి, రాంరెడ్డి, బిఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేష్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి లేని జగద్గిరిగుట్టను నిర్మిద్దాం

## సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్




**జగద్గిరిగుట్ట, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాదకద్రవ్యాల విక్రయాన్ని అడ్డుకొని గంజాయి లేని జగద్గిరిగుట్టను నిర్మించాలన్న సంకల్పంతో శుక్రవారం సిపిఐ కార్యాలయం వద్ద కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, మండల కార్యదర్శి కె. స్వామిలు, సీనియర్ నాయకులు ఏసురత్నం పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉమా మహేష్ మాట్లాడుతూ, "నేడు సమాజంలో ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇది సమాజంలో ప్రశాంతతకు భంగం కలిగిస్తోంది. జగద్గిరిగుట్ట ప్రాంతంలో మాదకద్రవ్యాల విక్రయాన్ని అడ్డుకోవడానికి ప్రతి బస్తీ పెద్ద, కమిటీ సభ్యుడు, ప్రజలు కలసి రావాలి" అని పిలుపునిచ్చారు. ఈ నెల 11న జగద్గిరిగుట్టలో పార్టీలకతీతంగా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. "రేపటి నుంచి సమావేశానికి ఆహ్వాన కార్యక్రమాలు ప్రారంభిస్తాం. ఈ ఉద్యమం ద్వారా మాదకద్రవ్యాలను అరికట్టి, ప్రజల భవిష్యత్తును కాపాడగలుగుతాం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, సిపిఐ కోశాధికారి సదానందం, దుర్గయ్య, కే. వెంకటేష్, సహదేవ్ రెడ్డి, యువజన నాయకులు కీర్తి, జంబు, చంద్రకాంత్, నారాయణ మేస్త్రి, ఇమామ్, మైనారిటీ నాయకులు హమీద్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వందేమాతరం 150వ వార్షికోత్సవం



**కందుకూర్, నవంబర్ 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూర్ మండల కేంద్రంలోని ఎంపియుపిఎస్ గుమ్మడవల్లి పాఠశాలలో వందేమాతరం గేయం 150వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 1875లో ప్రముఖ సాహితీవేత్త, దేశభక్తుడు బంకిమ్ చంద్ర చటోపాధ్యాయ రచించిన వందేమాతరం గేయం స్వాతంత్ర్య సమరయోధులకు స్ఫూర్తినిచ్చిన గీతంగా నిలిచిందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఆయన రచించిన 'ఆనందమఠం' నవలలో ఈ గేయం తొలిసారిగా చోటుచేసుకుంది. భారతమాత పట్ల అపారమైన మమకారం, గౌరవం ఈ గీతంలో ప్రతిబింబించిందని విద్యార్థులు వివరించారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు ఎం. ధర్మనాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "వందేమాతరం గేయం భారతీయులలో జాతీయ చైతన్యాన్ని నింపిన పవిత్ర గీతం. ప్రతి విద్యార్థి దీని అర్థాన్ని తెలుసుకొని దేశభక్తిని పెంపొందించుకోవాలి" అని సూచించారు.పంచాయతీ కార్యదర్శి శైలమ్, కారోబార్ శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు వందేమాతరం గేయాన్ని ఆలపించి, దేశభక్తి నినాదాలతో కార్యక్రమాన్ని అలరించారు. చివరగా అందరూ ఏకస్వరంతో "వందేమాతరం వందేమాతరం!" అంటూ దేశభక్తి జ్వాలను రగిలించారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీకి హుస్నాబాద్ విద్యార్థుల ఎంపిక



**హుస్నాబాద్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎడల బయ్యారంలో నవంబర్ 8-10 తేదీల్లో జరిగే 69వ రాష్ట్రస్థాయి పాఠశాల కబడ్డీ ఛాంపియన్షిప్‌కి హుస్నాబాద్ విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఎస్. రామ్ చరణ్, శ్రీ చైతన్య పాఠశాల 9వ తరగతి విద్యార్థి భుక్య రీషి కుమార్‌లు ఎంపికైనట్లు ఎస్జీఎఫ్ మండల కార్యదర్శి ఆర్. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కే. వాసుదేవా రెడ్డి మాట్లాడుతూ, "కబడ్డీతో పాటు చదువులో కూడా రాణించి జాతీయ స్థాయికి ఎదగాలి" అని సూచించారు. అక్టోబర్ 13న పటాన్‌చెరు మైత్రివనంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వీరు ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన కోచ్ కృష్ణ, ఎంఈఓ మనిల మేడం, సీనియర్ క్రీడాకారులు రాజేష్, రాకేశ్, సాయి, పీఈటీ రాజు తదితరులు అభినందనలు తెలిపారు.

# ప్లాస్టిక్ సంచులపై అవగాహన ర్యాలీ



**హుస్నాబాద్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుస్నాబాద్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సహస్ సీజీఏఐ స్వచ్ఛంద సంస్థ సహకారంతో శుక్రవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సంత ప్రాంతాన్ని సందర్శించిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్లాస్టిక్ సంచుల వల్ల కలిగే అనర్థాలను వ్యాపారులు, ప్రజలకు వివరించారు. బట్ట సంచులు, జనపనార సంచుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ "ప్లాస్టిక్ కవర్లు వద్దు - బట్ట సంచులే ముద్దు" వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కలిగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. నైనా దేవి, సహస్ సభ్యులు బాలరాజు, సంపత్, వినీత్, శ్రవణేష్ పాల్గొన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మార్కెట్ అంతా తిరుగుతూ పర్యావరణ పరిరక్షణపై సందేశం ఇచ్చారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేద్దాం: కామ్రేడ్ ఫయాజ్



**నాగర్‌కర్నూల్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) స్థాపనకు 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో నిర్వహించనున్న శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఎండీ ఫయాజ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "సిపిఐ 1925లో స్థాపితమై, బ్రిటిష్ ప్రభుత్వాన్ని సంపూర్ణ స్వాతంత్రం కోసం డిమాండ్ చేసిన తొలి రాజకీయ పార్టీగా నిలిచింది. నిషేధాలు, జైలు జీవితం, అజ్ఞాతవాసం మధ్య కూడా నాయకులు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో సిపిఐ కీలక పాత్ర పోషించింది. 4500 మంది ప్రాణాలు కోల్పోయిన ఈ పోరాటం ద్వారా తెలంగాణను నైజాం పాలన నుంచి విముక్తి చేసి భారతదేశంలో విలీనం చేశారు" అని గుర్తుచేశారు. దున్నేవాడికి భూమి" నినాదంతో ముందుకెళ్లిన సిపిఐ, 10 లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచిన ఘన చరిత్రను కలిగి ఉంది. యూపీఏ -1 ప్రభుత్వంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి పథకాలను తీసుకురావడంలో సిపిఐ పాత్ర అపూర్వమైంది. అధికారంలో లేకున్నా పేదల పక్షాన నిరంతర పోరాటం చేస్తూ ప్రజా సంక్షేమాన్ని సాధించడంలో సిపిఐ ముందుంటోంది" అని అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, మొలచింతలపల్లి శాఖ కార్యదర్శి జంగం శివుడు, సింగోటం శాఖ కార్యదర్శి చంద్రయ్య, తిర్నాంపల్లి శాఖ కార్యదర్శి వెంకటస్వామి, రామకృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

## చెన్నకేశవ స్వామి ఆలయంలో గుప్త నిధుల తవ్వకాల కలకలం



**అమ్రాబాద్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా పదరా మండలంలోని రాయలగండి లక్ష్మీ చెన్నకేశవ స్వామి పురాతన దేవాలయంలో గుప్త నిధుల తవ్వకాలు కలకలం రేపాయి. మద్దిమడుగు ప్రధాన రహదారి పక్కన ఉన్న కొండపై వెలసిన ఆలయంలో గర్భగుడి ముందు ధ్వజస్తంభం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు భారీ తవ్వకాలు జరిపినట్లు స్థానికులు తెలిపారు. గుప్త నిధుల కోసమే ఈ తవ్వకాలు జరిగాయని ఆరోపిస్తూ, దుండగులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆలయ బాధ్యులు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయని, రాత్రి వేళ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై జరిగిన విలేకరుల సమావేశంలో యురేనియం వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కలుముల నాసరయ్య, జక్కా బాలకృష్ణయ్య, భక్తులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి గ్రామస్థాయి అధికారులు కీలకం



**నాగర్‌కర్నూల్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన గ్రామస్థాయి అధికారుల శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్, అదనపు కలెక్టర్ దేవ సహాయం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి గ్రామస్థాయిలో పనిచేసే అధికారులు కీలకమని, వారు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. గ్రామసభల నిర్వహణ, సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి నెలా గ్రామ సభలు నిర్వహించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు, ప్రజాప్రతినిధులకు స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యల పరిష్కారంలో గ్రామస్థాయి అధికారుల పాత్ర అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ నుంచి మాస్టర్ ట్రైనర్ కృష్ణ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం సాగింది. పంచాయతీరాజ్, నీటిపారుదల, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య శాఖల నుంచి 35 మంది అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, పీడీ డీఆర్‌డీఏ చిన్న ఓబులేసు, సహాయ కార్యనిర్వాహణ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సర్ సి.వి. రామన్ పాఠశాలలో వందేమాతరం

### జయంతి ఉత్సవాలు



**హుస్నాబాద్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ పట్టణంలోని సర్ సి.వి. రామన్ పాఠశాలలో వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవం, సి.వి. రామన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, ఆడియో-వీడియో రౌండ్స్‌తో విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యంగా ఈ పోటీలు సాగాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కాయిత నారాయణరెడ్డి మాట్లాడుతూ, "సి.వి. రామన్‌ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు నూతన ఆవిష్కరణల దిశగా ఆలోచించాలి. క్విజ్ పోటీల్లో పాల్గొనడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నేటి అపజయం రేపటి విజయానికి మార్గదర్శకం" అని పేర్కొన్నారు. వందేమాతరం గీతం దేశాన్ని జాగృతం చేసిన ప్రేరణా గీతమని, 150 సంవత్సరాలుగా దేశం గర్వంగా ఈ గీతాన్ని ఆలపిస్తోందని అన్నారు. పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని విజేతలుగా నిలిచారు. సీనియర్స్ విభాగంలో గూళ్ళ సాయి తేజ, అగస్త్య నందన్, సాత్విక్, నిఖిల్, రాజేందర్ ప్రథమ బహుమతులు పొందగా, ప్రగతి, సహర్ష, శ్రీనిధి, హిమాన్సిక, రిత్విక్, మారుతి ద్వితీయ బహుమతులు పొందారు. జూనియర్స్ విభాగంలో రసజ్ఞ, అన్విత్, లతిక, కార్తిక, ఆయేషా, రాజ్ తరుణ్, శివ స్వార్థిత ప్రథమ బహుమతులు, మనస్విని, హర్షిత, ఆశ్రిత, కృతిక, మనోజ్ఞ, శాన్వి శ్రీ, అఖిల ద్వితీయ బహుమతులు పొందారు.

## వందేమాతరం గీతంతో విద్యార్థుల దేశభక్తి ప్రదర్శన



**ఎలిగేడు, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం వందేమాతరం గీతాన్ని ఘనంగా ఆలపించారు. మహాకవి బంకించంద్ర ఛటోపాధ్యాయ రచించిన జాతీయ గేయం "వందేమాతరం" 150 ఏండ్లు పూర్తయిన సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నరేంద్ర చారి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం గంద్ర దేవేందర్ రావు మాట్లాడుతూ, "వందేమాతరం అనేది ఒక నినాదమే కాదు, ఇది ఒక మంత్రం. ఈ నినాదంతో ఎందరో మహానుభావులు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని చరిత్రలో చిరస్మరణీయులయ్యారు" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొని దేశభక్తి భావాలను ప్రతిబింబించారు. పాఠశాలల ప్రాంగణం "వందేమాతరం" నినాదాలతో మార్మోగింది.

## కృత్రిమ కాలు ఏర్పాటు

### పోచయ్యకు నూతన ఆశ




**కూకట్పల్లి, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిద్దిపేట జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన పోచయ్యకు గత సంవత్సరం ప్రమాదంలో కాలు తీసేయడం జరిగింది. తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి (టివిహెచ్ఎస్ఎస్) రాష్ట్ర కమిటీ సూచన మేరకు, కూకట్పల్లి లోని భారత్ వికాస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనకు కృత్రిమ కాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు నరేందర్, మధు, స్వామి, రఘులను టివిహెచ్ఎస్ఎస్ కమిటీ శాలువాలతో సన్మానించింది. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ గుత్తికొండ, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మెరుగు శివకృష్ణ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పెద్దగుల్ల నాగరాజు, మహిళా నాయకురాలు యశోద గోద పాల్గొన్నారు. పోచయ్యకు నూతన ఆశను అందించిన ఈ సేవా కార్యక్రమం హృదయాన్ని తాకింది.

## వ్యవసాయాన్ని దెబ్బతీసే విధానాలను వ్యతిరేకించాలి: వీరేపల్లి వెంకటేశ్వర్లు



**దామరచర్ల, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతులను వ్యవసాయం నుండి దూరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనిని వ్యతిరేకించేందుకు రైతులు సంఘటితంగా పోరాడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. దామరచర్ల మండలంలో రైతు సంఘం మహాసభ సందర్భంగా జెండా ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ, "పత్తి ధరలు పడిపోవడం, సిసిఐ నిబంధనలు, కిసాన్ కపాస్ రిజిస్ట్రేషన్ వంటి అంశాలు రైతులను గోసపెడుతున్నాయి. దిగుమతుల పేరుతో కేంద్రం స్వదేశీ వ్యవసాయాన్ని దెబ్బతీస్తోంది" అని విమర్శించారు. రైతుల హక్కుల కోసం బలమైన ఉద్యమాలు అవసరమని, సంఘటితంగా పోరాడితేనే సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం మాలోత్ వినోద్ నాయక్ అధ్యక్షుడిగా, గోలి వెంకటరెడ్డి కార్యదర్శిగా 17 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు, డివైఎఫ్ఐ, గిరిజన సంఘం నాయకులు డబ్బికార్ మల్లేష్, రవి నాయక్, ఎర్రనాయక్, దయానంద్, పాపా నాయక్, బొచ్చు కోటిరెడ్డి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ పోలీస్ కమీషనరేట్‌లో వందేమాతరం 150వ దినోత్సవం



**కరీంనగర్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ గేయం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమీషనరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కమీషనరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం, ఇతర అధికారులు, సిబ్బంది సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. "ఈ గీతం స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాది మంది భారతీయులకు స్ఫూర్తినిచ్చింది. దేశభక్తిని నింపే శక్తి దీనిలో ఉంది" అని కమీషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ భీంరావు, ఆర్ఐ కిరణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్ గెలుపుతో జూబ్లీహిల్స్ అభివృద్ధికి బాటలు

### ఎం.ఎస్. రాజ్ ఠాకూర్



**గోదావరిఖని, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమాజిగూడ డివిజన్‌లోని ఎల్లారెడ్డిగూడ, పల్లవి అపార్ట్మెంట్స్ పరిసరాల్లో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతోంది. జూబ్లీహిల్స్ అభివృద్ధికి నవీన్ యాదవ్ గెలుపు కీలకం. ప్రజలు చరిత్రాత్మక తీర్పు ఇవ్వాలి" అని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గారిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు.



వందేమాతరం 150 సవంత్సరాలు పూర్తి అయినా సందర్బంగా బంజారాహిల్స్ లో సామూహిక గీతాలాపన లో పాల్గొన్న కేంద్ర హొూమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్.

# ఓటర్ లిస్ట్ పారదర్శకతపై కలెక్టర్ సమీక్ష




**సిద్దిపేట, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలో ఓటర్ సర్వే నిర్వహణకు సంబంధించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఎలెక్టోరల్ రోల్స్ రూపొందించేందుకు ఈ సమావేశం నిర్వహించామని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటర్ లిస్ట్ అత్యంత పారదర్శకంగా ఉండాలంటే, నియోజకవర్గం వారిగా ప్రతి పార్టీ నుంచి బీఎల్ఏస్‌ను నియమించాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ వారీగా ఇంటింటి సర్వే నిర్వహించి కొత్త ఓటర్లు, నివాసం మార్చినవారు, మరణించినవారి వివరాలను ప్రభుత్వ బీఎల్‌ఓలు, పార్టీ బీఎల్ఏస్‌లు కలిసి సమీకరించి సంబంధిత ఏఈఆర్ఓ లేదా ఈఆర్ఓలకు అందించాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్, ఏఐఎంఎం, సీపీఎం, వైఎస్ఆర్‌సీపీ తదితర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఓటర్ లిస్ట్ నాణ్యతకు రాజకీయ పార్టీల సహకారం కీలకమని అధికారులు అభిప్రాయపడ్డారు.

## వందేమాతరం గీతం వార్షికోత్సవంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్





**మల్కాజ్గిరి, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తూముకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన గీతాలాపన కార్యక్రమంలో మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. "వందేమాతరం, త్రివర్ణ పతాకం, జనగణమను స్వాతంత్ర్య సమరంలో జాతిని ఏకం చేసిన శక్తులు. దేశభక్తి లేకుండా జాతి ఐక్యత సాధ్యం కాదు" అని ఆయన పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ జ్యోతి, కార్పొరేటర్ రావుల శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

## వందేమాతరం గీతం దేశ ఐక్యతకు ప్రతీక

-కలెక్టర్లు హైమావతి, చంద్రయ్య







**సిద్దిపేట మంచిర్యాల, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సిద్దిపేట, మంచిర్యాల జిల్లాల్లో ఘనంగా సామూహిక గీతాలాపన కార్యక్రమాలు నిర్వహించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్, నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల ఆవరణల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య పాల్గొని గీతం ప్రాధాన్యతను వివరించారు.'బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతం స్వాతంత్ర్య ఉద్యమంలో దేశాన్ని ఏకం చేసింది. భిన్న మతాలు, భాషలు, ప్రాంతాల మధ్య ఐక్యతను చాటిన ఈ గీతం భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలి" అని హైమావతి పేర్కొన్నారు. "యావత్ భారతాన్ని ఏకం చేసి స్వాతంత్ర్య కాంక్షను రగిలించిన గీతం వందేమాతరం" అని చంద్రయ్య అన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో గీతాలాపన నిర్వహించారని అధికారులు తెలిపారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, కలెక్టరేట్ ఎ.ఓ. పిన్న రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి డిపెండెంట్‌లకు ఉద్యోగ నియామక పత్రాలు

నవంబర్ 16న కొత్తగూడెంలో పంపిణీ




**రామగుండం, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సింగరేణి కార్మికుల డిపెండెంట్‌లకు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ నియామక ఉత్తర్వులను నవంబర్ 16న కొత్తగూడెంలో జారీ చేయనున్నట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సి అండ్ ఎండి, డైరెక్టర్ ఫా లను కలిసి కార్మిక సమస్యలపై చర్చించిన అనంతరం యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. గత ఏడాది నుంచి నిలిచిపోయిన మెడికల్ బోర్డును నవంబర్ చివరిలో నిర్వహించేందుకు యాజమాన్యం అంగీకరించిందని, మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసుల్లో మెడికల్ ఫిట్ అయిన 473 మందికి పోస్టింగ్ ఆర్డర్లు అందనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా, నవంబర్ 10న డైరెక్టర్ ఫా స్థాయి స్ట్రక్చరల్ కమిటీ సమావేశం, 11న జేసీసీ సమావేశం నిర్వహించేందుకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. ఈ సమావేశాల్లో పెండింగ్ సమస్యలపై చర్చించి పరిష్కారాలు తీసుకురావాలని యూనియన్ నేతలు కోరారు. ఈ సమావేశంలో ముస్కే సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## "వందేమాతరం" గీతంతో దేశభక్తి చాటిన శ్రీనివాసులు



**కరీంనగర్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం ఉదయం గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. స్వతంత్ర సమరయోధులను స్మరించుకుంటూ, దేశభక్తిని చాటేలా ఈ కార్యక్రమం ఘనంగా సాగింది.సాంప్రదాయ దుస్తుల్లో తిలకధారణతో పాల్గొన్న శ్రీనివాసులు ఆలయ ప్రాంగణంలో "వందేమాతరం" గీతాన్ని ఆలపించగా, భక్తులు కూడా పాల్గొని దేశభక్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆలయ సిబ్బందిని సేవా సంస్థ సభ్యులు సత్కరించారు. ప్రధాన అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వాదం అందించారు.కార్యక్రమంలో వూట్కూరి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ వాసుదేవ శ్రీనివాస్, నార్ల, గట్టు, పైడ, పెద్ది, పడకంటి, చొక్కారపు, అవధూత, కలికోట, జిల్లా, మ్యాన, గోనె శ్రీనివాసులు పాల్గొన్నారు.

## స్కాలర్షిప్ ఫీ రీయంబర్స్మెంట్ విడుదల చేయాలంటూ ఎస్ఎఫ్ఐ ధర్నా



**కరీంనగర్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీ రీయంబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ మానకొండూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఆసంపల్లి వినయ్ సాగర్ మాట్లాడుతూ, "రెండు సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల హక్కులను నిర్లక్ష్యం చేస్తోంది. కాలేజీలు మూసివేసిన పరిస్థితుల్లో కూడా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటు. ఫీజు రీయంబర్స్మెంట్ బిక్ష కాదు, అది విద్యార్థుల హక్కు" అని అన్నారు. వెంటనే స్కాలర్షిప్ విడుదల చేయకపోతే రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంబాల సందేశ్, సంతోష్, రాజేందర్, మంజునాథ్, మహి కృష్ణ, రామ్ చరణ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండంలో దేవాలయాలపై దాడులకు నిరసన



**రామగుండం, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హిందూ దేవాలయాలపై జరిగిన దాడులను నిరసిస్తూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో రామగుండం పోచమ్మ మైదానంలో శుక్రవారం నిరసన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జి కందుల సంధ్యారాణి, మండల అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. అలాగే అన్ని పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సంఘీభావంగా పాల్గొన్నారు.

## హుజురాబాద్‌లో డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని రద్దు చేయాలి: బీసీ జేఏసీ



**హుజురాబాద్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుజురాబాద్‌లో వేస్ట్ బేస్డ్ డంపింగ్ యార్డ్ నిర్మాణానికి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్, హైదరాబాద్ టెండర్ నోటీసు జారీ చేసిన నేపథ్యంలో, proposed నిర్మాణాన్ని రద్దు చేయాలని బీసీ జేఏసీ, బీసీ ఆజాది ఫెడరేషన్, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు.వాతావరణ కాలుష్యం పెరిగి ప్రజలు, జీవరాసులు అనారోగ్యానికి గురికావచ్చని ఆందోళన వ్యక్తం చేస్తూ, మున్సిపల్ కమిషనర్ కింసారపు సమ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. "ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ నిర్మాణాన్ని తక్షణమే రద్దు చేయాలని, సంబంధిత అధికారులకు సిఫారసు చేయాలని" జేఏసీ నాయకులు చందుపట్ల జనార్ధన్, సందేల వెంకన్న విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల సదానందం, కొలిపాక శంకర్, ఇప్పకాయల సాగర్, చిలుకమారి శ్రీనివాస్, తాటిపాముల కనకయ్య, రామ్ సారయ్య, ఖలీద్ హుస్సేన్, గౌరీశెట్టి సాంబయ్య, దొంత హరికిషన్, వేల్పుల రత్నం, పెద్దపేట రమేష్, మండల వీరస్వామి, భారత ప్రభాకర్, దాసరి మల్లేశం, గోస్కుల మధుకర్, గరవేణ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతరం గీతం 150 ఏళ్ల ఘనయాత్ర

- బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలు




**హనుమకొండ, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాదిమంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన వందేమాతరం గీతానికి నేటితో 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. హనుమకొండ అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ, "వందేమాతరం గీతాన్ని నవంబర్ 7, 1875న బంకించంద్ర చటర్జీ రచించారు. ఇది స్వాతంత్ర సమరయోధుల రణ నినాదంగా నిలిచి, దేశభక్తిని నింపిన గేయంగా మారింది. నేటి నుంచి నవంబర్ 26 వరకు జిల్లా అన్ని మండలాల్లో వందేమాతరం గీతాన్ని ఆలపించేలా బీజేపీ శ్రేణులు కార్యాచరణ చేపట్టాలి" అని సూచించారు.బీజేపీ ఆధ్వర్యంలో 150వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్లో పార్టీ సైతం భాగస్వామ్యం అవుతుందని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు



**కరీంనగర్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కిమ్స్ కాలేజ్‌లో జాతీయ పతాక ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, గీతాల పోటీలు, చరిత్ర సదస్సులు నిర్వహించారు. వైస్ చైర్మన్ పేర్యాల సాకేత్ రామారావు మాట్లాడుతూ, "వందేమాతరం భారత జాతి గుండె చప్పుళ్లలో నినదించే స్వరం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గౌతం అర్జున్ రావు, సాయిబాబా, సతీష్, హరీష్, రామ్ కిషోర్, చంద్రకళ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో ఈటల పునఃప్రవేశం

## రాజకీయ సమీకరణాల్లో పెను మార్పు




**హుజురాబాద్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఇటీవల హుజురాబాద్‌లో తిరిగి అడుగుపెట్టిన నేపథ్యంలో, స్థానిక రాజకీయ వాతావరణంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కమలాపూర్‌లో 96 మంది బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీలో చేరిన ఘన కార్యక్రమం, శామీర్‌పేటలో బీఆర్ఎస్ నేతల ఈటలతో సమావేశంఇవన్నీ కొత్త రాజకీయ దిశకు సంకేతాలుగా నిలుస్తున్నాయి. ఈటల పునఃప్రవేశంతో హుజురాబాద్ పరిధిలో బీజేపీ శక్తివృద్ధికి నమ్మకాలు పెరుగుతున్నాయి. ప్రత్యర్థి పార్టీలలో ఆందోళన నెలకొనగా, ప్రజల మద్దతుతో బీజేపీకి ఊతం లభిస్తోంది. "మీరు హుజురాబాద్‌కు రారు అనుకున్నాం కానీ మీ చూపు తిరిగింది కదయ్యా' అంటూ స్థానికంగా ఈటలపై ఆసక్తికర చర్చలు సాగుతున్నాయి. ఈటల నాయకత్వం పట్ల గతంలో వ్యతిరేకంగా ఉన్నవారు సైతం ఇప్పుడు ఆకర్షితులవుతూ బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. "ఒక మనిషి దూరమైతే కానీ వారి విలువలు తెలుస్తాయి" అన్న భావన ప్రజల్లో విస్తరిస్తోంది. కమలాపూర్, శామీర్‌పేట ప్రాంతాల్లో జరిగిన ఈ పరిణామాలు, హుజురాబాద్‌లో రాజకీయ సమీకరణాలను మార్చే సంకేతాలుగా కనిపిస్తున్నాయి. ఈటల రాజేందర్ 2004 నుంచి తెలంగాణ రాజకీయాల్లో గట్టి గుర్తింపు పొందిన నేతగా, ఆరోగ్య, ఆర్థిక మంత్రిగా సేవలందించి, 2021లో బీజేపీలో చేరారు. ప్రస్తుతం మల్కాజిగిరి ఎంపీగా కొనసాగుతున్నారు. ప్రజా రాజకీయ వర్గాల్లో ఈటల పునఃప్రవేశం కొత్త ఉత్సాహాన్ని రేకెత్తించగా, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలలో కలకలం రేపుతోంది. "ఈటల వస్తే మా నాయకులు, కార్యకర్తలు ఆయన వైపు తాయారు అవుతారు" అనే మాటలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపుగా మారబోతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## న్యాయ విజ్ఞాన సదస్సులో విద్యార్థులకు చట్టాలపై అవగాహన




**కరీంనగర్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపల్లి హవేలీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కే. వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రాజ్యాంగ హక్కులు, భద్రతా చట్టాలపై అవగాహన కల్పించారు. జాతీయ న్యాయ సేవల టోల్ ఫ్రీ నెంబర్ 15100, మాదక ద్రవ్యాల నిరోధక, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్లు గుర్తుంచుకోవాలని సూచించారు. బాలికలు ధైర్యంగా ఉండాలని, సమస్య తలెత్తితే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా న్యాయ సేవా సంస్థకు సమాచారం ఇవ్వాలని సూచించారు. చెడు కోసంగా మొబైల్ వాడకానికి సంబంధించిన దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో లీగల్ ఎడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, ప్రధానోపాధ్యాయులు కన్నం రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## "విద్యార్థుల మేధాశక్తే ప్రయోగశాల"

### శాతవాహన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో గవర్నర్ సందేశం




**కరీంనగర్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన విశ్వవిద్యాలయ రెండో స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, కులపతి జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 25 మందికి పీహెచ్డీ పట్టాలు, 2018 -2023 మధ్య ప్రతిభ కనబరిచిన 161 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. విద్యార్థులను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ, "నిరంతర అభ్యాసమే విజయానికి మార్గం. శ్రద్ధ, క్రమశిక్షణతో లక్ష్యాన్ని చేరుకోవచ్చు. విద్యార్థుల మేధాశక్తే వారి ప్రయోగశాల. భయం, అలసటను అధిగమించి నైపుణ్యంతో ముందుకు సాగాలి" అని సూచించారు. విశ్వవిద్యాలయం న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌ల దిశగా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పిలుపునిచ్చారు. "విద్య బోర్డు, చాక్‌పీస్‌లకే పరిమితం కాకుండా సాంకేతికత, పోటీ తత్వంతో ముందుకు సాగాలి. ఆధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి" అని గవర్నర్ పేర్కొన్నారు.

## గీతా మందిరంలో "వందేమాతరం" 150 ఏళ్ల వేడుకలు



**కరీంనగర్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 10 గంటలకు కరీంనగర్ గీతా మందిరంలో గీత భక్త సమాజం సభ్యులు జాతీయ గేయాన్ని సమిష్టిగా ఆలపించారు. కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాలు వినిపించాయి. అధ్యక్షుడు బండ సత్తయ్య నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఉప్పల రామేశం, చిట్టీమల్ల దామోదర్, కాసం సుదర్శనం, గుండ రాధా కిషన్, మరియాల రవీందర్ తదితర ధార్మిక సంస్థల ప్రతినిధులు, మహిళా భక్తులు పాల్గొన్నారు. దేశభక్తి భావాలను నూరిపోసేలా ఈ కార్యక్రమం సాగింది.

## ఘనంగా డివైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవం



**కరీంనగర్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** డివైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు నాయక్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ, "భగత్ సింగ్ స్ఫూర్తితో నిరుద్యోగ యువత కోసం పోరాడే దేశవ్యాప్తంగా ఉన్న అతిపెద్ద యువజన సంఘం డివైఎఫ్ఐ" అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ భర్తీలో విఫలమయ్యాయని విమర్శించిన ఆయన, రానున్న రోజుల్లో యువత ఉద్యోగ అవకాశాల కోసం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవీందర్, భూపతి రమేష్, మహేష్, అభిలాష్, మోజస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ సందర్శించిన గవర్నర్




**కరీంనగర్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన విశ్వవిద్యాలయ కార్యక్రమం అనంతరం కరీంనగర్ కలెక్టరేట్‌కి చేరుకున్న తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విభాగాల వారీగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. వందేమాతరం గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించగా, బాలభవన్ విద్యార్థులు శాస్త్రీయ నృత్యం, దేశభక్తి గీతాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్లు అశ్విని, తానాజీ, వాకాడే, లక్ష్మి, కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నల్లకుంట జిహెచ్ఎస్ లో వందేమాతరం 150వ వార్షికోత్సవ వేడుకలు



**నల్లకుంట, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వందేమాతరం గీతం 150 ఏళ్ల పుర్తిని పురస్కరించుకుని నల్లకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సామూహికంగా గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ముత్యాల రవీందర్ మాట్లాడుతూ, "వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచింది. బంకించంద్ర ఛటర్జీ 1875లో రచించిన ఈ గీతం 'బంగ దర్శన్' పత్రికలో మొదటగా వెలువడి, అనంతరం 'ఆనంద మఠ్' నవలలో స్థానం పొందింది" అని వివరించారు. విదేశీ పాలనలో అణచివేతను ధిక్కరించే నినాదంగా వందేమాతరం దేశవ్యాప్తంగా విస్తరించి, ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచిందని తెలిపారు. 1950 జనవరి 24న డాక్టర్ రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో దీనిని అధికారికంగా జాతీయ గీతంగా ప్రకటించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి భవానీ, ఉపాధ్యాయులు నాగమణి, భాగ్యలక్ష్మి, అనిల్ కుమార్, రమేష్, విమల, నీరజ, సంధ్య రాణి, అనిత, శివకళ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల దేశభక్తి భావాన్ని నింపేలా ఈ వేడుకలు సాగాయి.

## భరణం పెంచాలని సుప్రీంకోర్టును ఆశ్రయించిన షమీ భార్య

**న్యూఢిల్లీ -నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** టీమ్ ఇండియా స్టార్ పేసర్ మహ్మద్ షమీ మాజీ భార్య హసీన్ జహాన్ రూ.4 లక్షల భరణం సరిపోవడం లేదని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నెలకు కనీసం రూ.10 లక్షలు భరణంగా నిర్ణయించాలని ఆమె కోరారు. పెరుగుతున్న జీవన వ్యయాలను, షమీ అధిక ఆదాయాన్ని పరిగణలోకి తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు షమీకి నోటీసులు జారీ చేసి, ఆయన సమాధానం కోరింది. "నెలకు రూ.4 లక్షలు ఇప్పటికే పెద్ద మొత్తం కాదా?" అని కోర్టు వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ

## వెంకట్రావుపల్లిలో వందేమాతరం గీతాలాపన



**రామడుగు, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వెంకట్రావుపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సామూహిక గీతాలాపన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి మాట్లాడుతూ, "వందేమాతరం గీతం స్వాతంత్ర్య చైతన్యాన్ని నింపి దేశాన్ని ఏకం చేసింది" అని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవి శెట్టి, ఆంజనేయులు, మిట్టేపల్లి రవీందర్, శ్రీలత, శ్యామ దత్తు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## డాక్టర్ సత్య ప్రకాష్‌కు ప్రాంతీయ సమన్వయ అధికారిగా బాధ్యతలు



**కరీంనగర్, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ప్రాంతీయ సమన్వయ అధికారిగా డాక్టర్ ఎం. సత్య ప్రకాష్ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఈ పదవిలో ఉన్న డాక్టర్ వంగల శ్రీనివాస్ ఉద్యోగ విరమణ పొందిన నేపథ్యంలో, కరీంనగర్ శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సత్య ప్రకాష్ బాధ్యతలు చేపట్టారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ, టిజిసి జిటిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విభాగాధిపతులు, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రామడుగులో ఉపన్యాసం, వ్యాసరచన, క్విజ్ పోటీలు




**రామడుగు, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** టి-సాట్, గెజిటెడ్ హెడ్మాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండల స్థాయి పోటీలు నిర్వహించారు. మండల విద్యాధికారి జి.పి.వి. రంగనాథ శర్మ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, పోటీ మనోభావం పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయని విద్యాధికారి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు ఇద్దరి నేతల పుట్టినరోజు వేడుకలు.


-గ్రామ గ్రామాన వేడుకలకు కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు సిద్ధం.



**ఎలిగేడు, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు ఇద్దరు నేతల పుట్టినరోజు వేడుకలు ఒకే రోజు కావడంతో మండల కేంద్రంతో పాటు గ్రామ గ్రామాన వారి పుట్టినరోజు వేడుకలను జరపడానికి కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు ఉత్సాహంగా ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దగ్గరి సన్నిహితునిగా ఉంటున్న ఎమ్మెల్యే విజయ రమణారావు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు మరియు రైతులకు అండగా ఉంటు ప్రజలకు అందుబాటులో ఉంటున్న విజయ రమణారావు పుట్టినరోజు వేడుకలు జరపడానికి గ్రామ గ్రామాన కార్యకర్తలు కాంగ్రెస్ నాయకులు సిద్ధంగా ఉన్నారు.

# అందుగుల వాగులో అక్రమ ఇసుక రవాణా

- ట్రాక్టర్ పట్టివేత



**మాడుగుల, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాడుగుల మండలం అందుగుల గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది, అనుమానాస్పదంగా వచ్చిన ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేశారు. ట్రాలీలో ఇసుక నింపబడినట్లు గుర్తించి, డ్రైవర్‌ను అనుమతుల గురించి ప్రశ్నించగా, ఎటువంటి అనుమతులు లేవని వెల్లడించాడు. అక్రమంగా అందుగుల వాగు నుండి ఇసుక తరలిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో ట్రాక్టర్ (TS31A%7978), ట్రాలీ (TS05EG 7765) ను స్వాధీనం చేసుకున్నారు.డ్రైవర్ పోతులపల్లి రాజు, యజమాని ముదిగొండ ఈ దమయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని మాడుగుల సీఐ వేణుగోపాల్ తెలిపారు.

# తెలకపల్లిలో గంజాయి కలకలం

- ఆరుగురు యువకులు అరెస్ట్





**తెలకపల్లి, నవంబర్ 7(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలకపల్లి మండల కేంద్రంలో గంజాయి సేవన కలకలం రేపింది. నవంబర్ 7న పోలీసులకు అందిన సమాచారం మేరకు, నాగర్‌కర్నూల్ రోడ్డుకు సమీపంలోని గ్రానైట్ క్వారీ వద్ద కొంతమంది యువకులు గంజాయి సేవిస్తున్నారని తెలకపల్లి ఎస్సై బి. నరేష్ సిబ్బందితో కలిసి స్పాట్‌కి చేరుకుని తనిఖీ చేశారు. అక్కడ ఐదుగురు యువకులు, ఒక మైనర్ గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారు. విచారణలో నాగర్‌కర్నూల్‌కు చెందిన రేణు కుమార్, రాసాల నారాయణ, మైలగోని సందీప్‌లు గత నెల 26న హైదరాబాద్ దుల్‌పేట ప్రాంతానికి చెందిన ఆకాశ్ సింగ్ నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. వారి ద్వారా తెలకపల్లికి చెందిన యువకులు గంజాయి తీసుకుని సేవిస్తున్నట్లు స్పష్టమైంది. పోలీసులు గంజాయి సేవిస్తున్న యువకులను అదుపులోకి తీసుకుని 138 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచారు. ఈ దాడిలో గుంపాల గణేష్, ముప్పారపు అఖిల్ అలియాస్ చింటూ, గుగ్గిళ్ల చరణ్, అరకు విశ్వాస్, ఎడ్ల వంశీతో పాటు ఒక మైనర్ యువకుడు అరెస్టయ్యారు.నాగర్‌కర్నూల్ డీఎస్పీ బుర్రి శ్రీనివాసులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి, ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మత్తు పదార్థాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో పోలీసులు ఎప్పుడూ సన్నద్ధంగా ఉంటారని, ఇలాంటి సమాచారం ఉన్నవారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని డీఎస్పీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

# వందేమాతర గీతం దేశ ప్రజలను ఏకం చేసింది :



**యాచారం, నవంబర్ 07 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** స్వాతంత్ర ఉద్యమంలో అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాల ప్రజలను ఏకం చేయడంలో ముఖ్య పాత్ర పోషించింది. వందేమాతరం గీతం అని యాచారం సిఐ నందీశ్వర రెడ్డి అన్నారు. బంకించంద్ర చటర్జీ వందేమాతర గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భరతమాత పట్ల ప్రేమ, గౌరవ భావాలతో యాచారం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో సిఐ నందీశ్వర రెడ్డి ఆధ్వర్యంలో సామూహిక గేయాలాపన చేశారు. ఈ సందర్భంగా సిఐ నందీశ్వర రెడ్డి మాట్లాడుతూ%ొ% వందేమాతరం సమర నినాదానికి 150 సంవత్సరాలు పూర్తయ్యాయని, స్వాతంత్ర్య ఉద్యమంలో ఈ గేయం కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు దేశ ప్రజలను ఒక తాటిపైకి తెచ్చిందని తెలిపారు. ఈ గేయం స్వాతంత్ర్య సమరయోధుల్లో ఉత్సాహం నింపి, సాధారణ ప్రజలను కూడా పోరాటయోధులుగా మార్చిందన్నారు. వందేమాతరం పాటలోని విలువలను, దాని వెనుక ఉన్న స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు చేరవేయడం మన బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాచారం పోలీస్ సిబ్బంది యాచారం ప్రజలు ఆర్టీసీ ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు .

# మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలి






- ఎమ్మెల్సీ కవిత




**చేవెళ్ల, నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మిర్జాగూడ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ప్రతి కుటుంబానికి రూ. కోటి పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పీఎంఆర్ మెడికల్ కళాశాలలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన ఆమె, వారి కుటుంబ స్థితిగతులు, చికిత్స వివరాలను తెలుసుకున్నారు. విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈ ప్రమాదంలో 19 మంది మృత్యువాత పడటం, 30 మందికి పైగా గాయపడటం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. గాయపడిన వారికి కనీసం రూ. 10 లక్షల పరిహారం ఇవ్వాలని, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఎన్‌హెచ్ 163 రహదారిలో నిర్మాణ లోపాలు ఉన్నాయని, రెండు వైపులా కుంగిపోయిన రోడ్డు వాహనచోదకులను ప్రమాదంలోకి నెట్టేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ –బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణకు నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ, ఎన్జీటీలో పెండింగ్‌లో ఉన్న కేసును ఉపసంహరించడంలో ప్రభుత్వాలు అలసత్వం చూపుతున్నాయని విమర్శించారు. విస్తరణ పనులను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తాండూరులో రోడ్డు విస్తరణ కోసం ధర్నా చేసిన 30 మందిపై కేసులు నమోదు చేయడాన్ని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజల బాధను అర్థం చేసుకుని, ఆ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం ఆమె ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కప్పాటి పాండురంగారెడ్డి, ముస్తఫా తదితరులు ఆమెతో ఉన్నారు.

# జీతం ట్రిలియన్ డాలర్లు..

## ఆనందం పట్టలేక రోబోతో కలిసి డ్యాన్స్ చేసిన మస్క్.



**న్యూఢిల్లీ నవంబర్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రపంచ కుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ సంచలనం సృష్టించారు. కార్పొరేట్ చరిత్రలోనే అత్యధిక జీతం అందుకుంటున్న సీఈవోగా ఆయన రికార్డు క్రియేట్ చేశారు. జీతం కింద మస్క్‌కు ట్రిలియన్ డాలర్లు ఇచ్చేందుకు టెస్లా కంపెనీ షేర్‌హోల్డర్లు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో జరిగిన టెస్లా వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో మస్క్ ఆనందానికి అవధులు లేవు. ఈ గుడ్‌న్యూస్‌ను తన సంస్థకు చెందిన హ్యూమనాయిడ్ రోబోస్‌తో సెలబ్రేట్ చేసుకున్నారు. రోబోలతో కలిసి ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తూ మస్క్ సందడి చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.జీతం కింద మస్క్‌కు ట్రిలియన్ డాలర్లు ఇచ్చేందుకు టెస్లా కంపెనీ షేర్‌హోల్డర్లు ఆమోదించారు. వార్షిక కంపెనీ మీటింగ్‌లో మస్క్ జీతంపై నిర్ణయం తీసుకున్నారు. దీంతో పే ప్యాకేజీలో కొత్త రికార్డు క్రియేట్ అయ్యింది. కంపెనీకి చెందిన షేర్‌హోల్డర్లలో 75 శాతం ఓట్లు ఆయనకు అనుకూలంగా వచ్చాయి. ఇప్పటికే ప్రపంచ కుబేరుడైన మస్క్. ఇప్పుడు తన సంపదను మరింత పెంచుకోనున్నారు. అయితే రాబోయే పదేళ్లలో ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ టెస్లా మార్కెట్ వాల్యూ ఆయన మరింత పెంచాల్సి ఉంటుంది. ఒవకేళ షేర్‌హోల్డర్లు అనుకున్నట్లు మస్క్ తన లక్ష్యాలను సాధిస్తే, అప్పుడు ఆయనకు లక్షల సంఖ్యలో షేర్లు కలిసిరానున్నాయి.మస్క్‌కు ట్రిలియన్ డాలర్ల పే ప్యాకేజీ అందాలంటే ఆయన ముందు కొన్ని టార్గెట్లను పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం టెస్లా మార్కెట్ విలువ 1.4 ట్రిలియన్ల డాలర్లుగా ఉన్నది. అయితే ఆ మార్కెట్ విలువను ఆయన 8.5 ట్రిలియన్ డాలర్లకు చేర్చాల్సి ఉంటుంది. స్వీయ డ్రైవింగ్ చేస్తున్న లక్షల సంఖ్యలో రోబోట్యాక్సీ వాహనాలను ఆయన కమర్షియల్ ఆపరేషన్‌లోకి తీసుకురావాల్సి ఉంటుంది. ఒకవేళ అన్నీ అనుకుట్లే సాగితే, ప్రపంచ కుబేరుడు మస్క్ ప్రపంచంలోనే తొట్టతొలి ట్రిలియనీర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.